4163

ప్రబుద్ధాంధ్ర

సంపుటము ౬ రాజమహేంద్రవరము ౧౧ జూన్ ౧౯౩౪ ౬ వ సంచిక

అరికాళ్లకింద మంటలు పెడితే........!

సుబ్రహ్మణ్యశాస్త్రి—సంపాదకుడు

"దిమ్మచెక్కలాగ అలా కూచోకపోతే కాస్త గంధం తియ్యరాదటే? రోజూ రోజూ చెప్పాలా?"

"పెద్దబావ నిన్ననే వెళ్లిపోయారు కదా, యింకెవరు పూసుకుంటారూ?"

"మీ అమ్మా మీ నాన్నా—నోటితో చెప్పరేటే?"

"లేకపోతే యెలా తెలుస్తుందీ?"

"ఆ మాత్రం వూహించుకోవద్దూ? ముసలాళ్లా, ముక్కాళ్లా, వాళ్ళకేం గంధం వూసుకోకా?"

"....................."

"ఈ జన్మలో నీకెలాగా యోగం లేదు. ముందు జన్మలో నేనా సుఖపడాలంటే యిప్పుడిలాగ ముత్తయిదువులికి గంధం తీసి యివ్వడమూ, మల్లెమొగ్గలు దండలుగుచ్చి వెయ్యడమూ—అందులోనూ—కిల్లికి. ఇంతకంటే పుణ్యం యేం వుందే?"

"ఈ జన్మలో యింతయింది, యిక ముందుజన్మలో అనుభవించకపోతా నని బెంగ. ఏదో, చేతులారా ప్రాణాలు తీసేసుకోలేక బతకడం......కాకపోయినా ముందుజన్మలో మనిషినే అయి పుడతా నన్న మాటేమిటీ?"

"నిజమే. ఇలాంటి బుద్ధులుండేవాళ్ళకి మనిషిజన్మ యెలా వస్తుందీ?"

"ఇంతకంటే పశువుజన్మో, పిట్టజన్మో వస్తేనే నయం. ఈ రాతా, యీ గోతా—"

"వెనకటిజన్మలో యెవళ్ళని చూసి యేడ్చావో? ఎవళ్ళ సుఖం పడనివ్వలేదో? ఎవళ్ళకి యెడబంధాలు కల్పించావో? లేకపోతే నీకీ రాత యెందుకు వస్తుందీ? ఇప్పుడేనా ముందు జన్మకోసం జాగ్రత్తపడవే అంటే—నీకోసమే కాని నాకోసమా యేమిటి?"

"నీకోసం అని యెవ రన్నారూ?......అన లెవరికోసం అయితే మాత్రం నాకు తప్పుతుందా? నువ్వు ప్రేమ వున్నదానవు కనక నీకూతురికోసం గంధం తియ్యమన్నావు. తప్పని యెవ రన్నారూ? నాకా వూహ కలగలేదు; కాని నేను మాత్రం తియ్య నన్నానా, తియ్యనా? నువ్వు చెప్పావు కనక యిక యివాళ మొదలు యేరోజనేనా మరిచిపోతే అడుగు. తిని

కూచుని—కూచుంటే సాగుతుందా యేమిటి నాకు? రెక్కల్లో సత్తువ వుండికదా!"

"వోసి నీముఖం యీడ్వా! శాస్త్ర మాట అనేటప్పటికి కంత దండకం విడిచేశావే!"

"......................"

"తల్లికి చెయ్యడానికే యేడ్చేదానవు నువ్వు మరో కళ్ళ కేంచేస్తావే!"

"......................"

"బాన వుస్న వారంరోజులూ మొగం మాడ్చుకునో యేడుస్తూనో యెలాగయితేం శాస్త్ర గంధం తీశావే! స్నానానికి కసిన్ని నీళ్ళు కాచావే!......ఇంతేనా నువ్వు చేసింది? వేసం అంతా చదువుకున్న బ్రాహ్మణులు అతగాడికి చెయ్యడం దేవుడికి చెయ్యడం కాదుటే!"

"దేవుడికో మనిషికో చెప్పిండల్లా—తోచిండల్లా—చేతనైనంతా చేశాను. నేనేమీ వొళ్లు దాచుకోలేదు. దాచుకోను"

"దాచుకుందా మంటే మాత్రం సాగనిస్తారా యేమిటి?"

"సాగనిస్తున్నారా యేమిటి? సాగనివ్వ మని మాత్రం నేనేడ్చానా యేమిటి? దొడ్లో గేదె వుంది, యింట్లో నేనూ వున్నాను. ఇంటిల్లపాదికీ—"

"వోసి నీసిగ్గు చిముడా! కనిపెంచే గేదెకీ నీకూ సాపత్యంటే!"

"......................"

"కనా లని— యెంతవూహా వుండే దిక్కుమాలిన దీనగా!......మీ నాన్నతో చెబుతా నుండు"

"......................"

"దరిద్రం వోసుకుంటూ పుట్టావు. నీకంత యోగం యెలా పడుతుందీ?"

"......................"

"నువ్వే దుర్ముహూర్తాన కడుపున పడ్డావో కాని అప్పుడు చచ్చిబతికింది మా అమ్మ. నువ్వు చేట్లో పడ్డావు, మీనాన్న వుద్యోగం పోయింది"

"నాకు పుస్తి కట్టాడు, ఆపిల్లాడు చచ్చాడు. ఏం, ఈమాటకూడా అన్నావు కాదేం?"

"ఇంకా అనలేదే మని దెప్పడం కూడానా? నిజంగా నిన్నే పెళ్ళాడకపోతే బతికే వుండు నా వెర్రిబాగుల నాయన. పదిహేనేళ్ళకీ మిటికెక్కలేమను— అతనెంత గొప్ప వుద్యోగస్థుడయిపోవునో నీకేం తెలుసూ?... పైగా చచ్చాడు, చచ్చాడని యీసడింపుకూడానా?"

"......................"

"నీకు పుస్తికట్టడమే అతని కొంప తీసింది"

"......................"

"నువ్వు కాలుపెట్టావు, వొక్క కొడుకు—ఆతల్లి కడుపు కాలిపోయింది"

"......................"

"నిజంగా చచ్చి సుఖపడ్డాడా అబ్బాయి. అతను బతికే వుంటే నువ్వు కాపరం చేస్తువా?......కాపరమే చేస్తే అతనికి అన్నం పెడుదువా?......అన్నం పెడితే నిద్రపోనిస్తువా?......నిద్ర పోనిస్తే—"

"నిద్రపోనిస్తే పీక పిసికి చంపెయ్యకపోదువా?"

"నువ్వు అంతవని చేసేదానవుమాత్రం అవుదువు. విన్నావా?......నువ్వెంత కేనా సాహసురాలవు"

"......................"

"చేసుకున్నవాణ్ణి— చచ్చినవ్రగ్గాన్నున్న మొగుణ్ణి యింతలేసిమాటలు—"

"నన్ను చేసుకున్నాడు కదా, మరి ఆపిల్లాడికి స్వర్గం వస్తుందా?"

"అదీ నిజమే. అదీ నిజమేనే!......ఎంత జాణవైనావూ?......కొంప చెడపుట్టి—చివరికి మనువర్తికి కూడా గతి లేకుండా—"

"చాకిరీకోసం పుట్టాను. ఇక మనువర్తి యెందుకూ నాకూ? చేయించుకున్న వాళ్లు గంజి పొయ్యకపోతారా"

"కనక చెయ్యి......నన్నెదిరిస్తావా? ఎదిరిస్తావా అంట?......నన్నెదిరించి నువ్వు బతికి బట్టకడతావుటే!"

"ఆవుపాయం మాత్రం శాస్త్ర తొరగా చూడు, చాలా పుణ్యం వస్తుంది నీకు"

"ఏమన్నావూ !......ఏంపేలుతున్నావూ ? నేనేం మందులు పెడతానా మాకులుపెడతానా ? ఎంతలేసి మాట లంటున్నావే చలితేలులాగా ?"

"......................"

"నేలబెట్టి రానేస్తాను కాని నిన్ను చావనిస్తానా నేనూ ?......చూస్తూ వుండు"

"......................"

"ముందు నేను కాస్త నిద్రపోయిలేచాటప్పటికి కంచులు బాగుచెయ్యకపో, మహామ్మాయి వండించేస్తాను నిన్ను"

౨

"ఏమే, చెల్లీ ? ఒక్కపని చెబుతాను చేసిపెట్టవూ?"

"అడగడం యెందుకూ ?"

"చేస్తా నను"

"చెయ్యక యేంచేస్తానూ ?"

"......ఈగుడ్డ రైక కుట్టిపెట్టాలి"

"......అలాగే"

"దీపాలుపెట్టాటప్పటికి— తెలిసిందా ?"

"ఇవాళ కాదు. రేపుసాయంత్రానికి కుట్టియిస్తాను"

"ఇవాళేం చేస్తా వమ్మా ?"

"పెద్దక్క, కూతురికి జాబ్బా కుట్ట మని యిందాకానే యిచ్చింది గుడ్డ. పని తెములగానే అది ముందు చెయ్యాలి"

"పోనీలే........."

"ఏం, వుళాక్కుంటా వేం ?"

"......................"

"నేను కుట్ట ననలేదు. ఆపైని నీయిష్టం"

"నోటితో వేరే అనాలా యేమిటి ? పైగా, నీ యిష్టం కాని నాయిష్టమూ యేమిటి? నాయిష్ట మయితే రేపుసాయంత్రందాకా యెందుకు వాయిదా వేస్తావూ!"

"ముందు పుచ్చుకున్నది వెనక్కి పెడితే అదే మంటుందో యేమేనా ఆలోచించావా ?"

"కొడుతుందా యేమిటి !"

"......................"

"దాని కూతురికి లగ్గం మించిపోతుందా యేమిటి!"

"......................"

"అసలు పెద్దదంటే నీకభిమానం. స్పష్టంగా అలా చెప్పెయ్యక మునుగులో గుద్దులాట యెందుకూ!"

"దుడుగూదుడుగూ మాట లనెయ్యడ మేనా నాసంగతి చూడ్డం వుందా!"

"నీసంగతి కేమమ్మా ! వండాలా వార్చాలా!"

"అదే నయం. మడికట్టుకుంటే చాలా పనులు తప్పించుకోవచ్చు"

"ఇప్పుడయితే మాత్రం యీకసిన్ని కంచులూ బాగుచెయ్యక మేనా!"

"ఇప్పు డెన్ని గంట లయిందో యెరుగుదువా!"

"రెండే కాదూ ? మూడు కొట్టాటప్పటికి యీపని అయిపోతుంది"

"వొక్క గంటలోనా!"

"పోనీ, నాలుగింటికి. ఏం ? తరవాత యేం చేస్తావమ్మా!"

"గంధం యెవరు తీస్తారూ!"

"ఎవరికి!"

"అమ్మకి, నాన్నకీ—"

"అమ్మ తియ్యమందా."

"అమ్మమ్మ పురమాయించింది. అసలు యెవరూ చెప్పకుండానే నేను వూహించుకోవలసిందిట"

"పోనీ, అరగంటలో అదయిపోతుంది. తరవాతా!"

"అప్పటికి మరో కొత్తపని తగలకపోతే అక్క కూతురు జాబ్బా—"

"ఎంత చెప్పినా చివరి కదే మాట. ఇవాళో రేపో వస్తారు మీబావ. రెండునెలల కిందట వచ్చినప్పుడు తెచ్చి యిచ్చారిది. మళ్లీ వచ్చాటప్పటి కేనా—"

"ఇన్నాళ్లూ చెప్పావు కాదేం!"

"ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది. కాకపోయినా గంట పని. నువ్వు తలుచుకుంటే అరగంటలోనే అయిపోతుంది......కుట్టిపెట్టవే ! ఏమే చెల్లీ!"

"అక్కడికి కోపం రాకుండా చూస్తావా మరి!"

"......నీయిష్టం వచ్చినట్టు తిరుగు. ఇంచేతే నిన్ను చూస్తే నాకు వొళ్లు మండిపోతుంది. నేనే పని చెప్పినా యింతే నువ్వు. పెద్దదంటే మాత్రం పడి చచ్చిపోతావు. అదీ నువ్వు కట్టకట్టకు గోదావరిలో దిగండి. కాస్త కైక భాగ్యానికి—నేను కట్టకోలే నను కున్నావు కాబోలు పసం! నన్నీమాత్రం సాయం చెయ్యలేపోతావా అని అడక్కుండకి—పోనీ రేపు సాయంత్రానికి తప్పకుండా యిస్తావా!"

"ఇస్తాను"

"మూడు పంక్తులు రేపు పొద్దున్న కుట్టెయ్యి. ఏం!"

"అలాగే చూస్తాను"

"చూస్తా నేమిటి, చేస్తా నను"

"అంటే చేసి, అనకపోతే చెయ్యక మానానా!

"నడే. ఏం సంగనాచివే మామ్మా!"

"......................"

"ఎంతజరిమానిరినా సరే అనే అంటావు కాని—రేపు సాయంత్రానికి తప్పకుండా యిస్తావుకదా!"

"ఇస్తాను"

"........మరిచిపోకసుమా. అసలు భోజనాలు కాగానే నేను వచ్చి నీదగ్గరే పడుకుంటాను. దొంగ్గమాలిన వొండలు ముదరడంవల్ల కుండలీనగానే కునుకు నేను నిద్రపోలేగాని— మళ్లీ లేచాటప్పటికి కాస్తేస్తావు. కాదూటే!"

"......................"

"మీనాన్న యెంతో మెచ్చుకుంటారు నిన్ను. నాదికి వుద్యోగం అయినాక నువ్వు వచ్చి నాదగ్గిర వుందువు కాని. ఏమే! వుంటావా!"

"ఎక్కడా వుండకపోతే రోజు ఎలా గడతాయి నాకూ!"

"ఎంతమాటన్నావే మాతల్లీ! నువ్వు రాకపోతే నేను నీనుకోలేననుకున్నావా యేమిటే! అసలు వంట లక్కనే పెట్టుకుంటాం మేము. వాళ్ల అవసరమే లేదూ మాకు"

"......................"

"రేపు కుట్టకపోతే అమ్మమ్మతో చెబుతా నేమను కున్నావో మరి! నా కేం!"

"......................"

3

"జబ్బా తో పట్టు కయింది—ఇంకెందుకే గుడ్డ!"

"అమ్మాకి నాన్నకీని"

"......................"

"......................"

"నగ మేనా కట్టావా పోనీ!"

"కత్తిరింపు లయినాయి"

"సెబాసు. పొంటిగంట కిస్తే యిప్పటికి కత్తిరింపులా అయినాయి!"

"నువ్వలా వెళ్లగానే నాలుగుకుంచాల కందుల తట్ట వచ్చి నానెత్తిమీద కూచుంది"

"......................"

"ఇప్పుడే నీదగ్గిర కూచున్నాను. ఒక్క అరగంటకి యిది పూర్తిచేసేసి బుల్లెమ్మ చొక్కా పని చేస్తాను"

"చిన్నక్క యేమిటీ యిచ్చింది!"

"దానికి రైక కుట్టిపెట్టాలిట"

"దాని కూడా చింపు లయినాయి. కదూ? నాకు తెలుసు. అదంటే నీకభిమానం యెక్కువ. నేను మొదలు ఇచ్చిన పని మానేసి—సగం సగం చేసి అది మొదలు పెట్టావు. అవునా!"

"చెప్పేది వినిపించుకోకుండా—"

"అక్కర్లేదు, తెలవడం లేదా యేమిటి? ఎన్నో మాట్లు చూశాను నీగుణం. నువ్వెప్పుడూ దానికోసం దొల్లి పోతావు. నాకంటే అదేమీ నీకు పొరగబెట్టలేదు"

"......................"

"వంటిపిల్ల యెక్కువో తాడిచెట్టులాగ కాపరం చేసేది యెక్కువో కనిపెట్టకపోయావు నువ్వు"

"......................"

"తండ్రి తెచ్చిన గుడ్డ పింతల్లివి, నువ్వు కుట్టిపెడతా వని—చూడవే—చూడవే నీకేసి యెంత ఆశగా చూ స్తోందోనూ!"

"దిక్కుమాలిన పిన్ని—చచ్చిపోయిన పిన్ని—నా కేసి చూస్తే యేం వుంది తల్లీ!......మాఅమ్మే! మా తల్లే! జాబ్బా కుట్టిపెడతా నమ్మా! రాత్రి తిండి మానే శానా కుట్టిపెడతాను. తప్పకుండా కుట్టిపెడతాను"

"చేతీసిన వాళ్లని పట్టుకు పాకులాడతారు చంటి పిల్లలు. నీకు తెలిసింది కాదుగాని నాపిల్ల నీపిల్లే అను కుంటే యెంత బాగుండునూ! ఇలా అయిపోయిన వాళ్లు లోకంలో అక్కల పిల్లల్ని పెంచి యెంతమంది సుఖప డ్డ లేదూ?"

"..... ...."

"చిన్నక్కలాగ మాయమాటలు చెప్పడం నాకు రాదు. నువ్వంటే నేనెంత అభిమానపడిచస్తానో—యెందుకూ చెప్పకోడం? నువ్వు నాతో వచ్చా వంటే నియమంలో మా ఆడబడుచుని లేవగొట్టెయ్యనూ? నా యిల్లంతా నీస్వాధీనం చేసెయ్యనూ?"

"..... ...."

"నువ్వు చేసే చాకిరీ చూస్తే—నువ్వు పిల్లని మానుకుంటూ వుంటే చాలు, వొక్క పని చెబుతానా నేనూ?"

"....................."

"ఇంచక్క, మాధవస్వామిగుడి మాయింటి కింటో దగ్గిర. రోజూ వెళ్లి—నీకంతకంటే యేంకావాలీ? గు ప్పెడన్నం—చారెడు బట్ట—నీకు లోటు చేస్తానా నేను? అసలు తాళాలు నీచేతికే యిచ్చేస్తారు మీబావ. నెల్లా ళ్లు తిరిగా రంటే దోసెడేసి రూపాయలు—నోములు, వ్రతాలు, కాశీరామేశ్వరాలు—నీకడ్డేమిటి నాయిం టోను?"

"..........................."

"చిన్నక్క నిన్ను తీసుకువెడుతుం దని వుబలాట పడుతున్నావు కాబోలు. దానిమొగుడు—అలాంటి చోట నువ్వుండకూడదు"

"..........................."

"నువ్వేనా పూహా తెలిసిన దానవు కాని చిన్నపిల్ల వు కావు. బాగా ఆలోచించుకో"

"..........................."

"నేనొక్కమాటు వాళ్ల సుందరమ్మగారి యింటికి వెళ్లివస్తాను, యిదయిపోగానే జుబ్బా కుడుతావు కాదూ"

"అలాగే"

"ఈమాటలు చిన్నక్కతో అనేవు సుమా? వొత్తి కజ్జాకోరు పీనుగు అది...నన్నేం చెయ్యగలదు గానీ—అయినా యెందుకూ?"

"అలాగే"

"మరి వెళ్లి రానా?"

"ఊఁ"

"మాసం వచ్చాటప్పటికి పిన్ని నీకు జుబ్బా కుట్టేస్తుం ది. వెంటనే అది తొడిగేసుకుని—ఇవాళ రాత్రి దాని పక్కలో పడుకుంటువుగాని నువ్వు, ఏం తల్లీ?"

౪

"ఏంచేస్తున్నావు రుక్కూ?"

"ఇప్పుడే గంధం యింటో పెట్టేసి, వచ్చి కూచున్నా ను పెద్దక్క కూతురు జుబ్బా కుడదా మనీ"

"దాని కిప్పుడేం తొందరా?"

"ఎవళ్ల పని వాళ్ళకి తొందరే. ఇంకా పూర్తి కాలే దా అని తడవం కిందటే నాగకీసుకుని వెళ్లిందది"

"తేరగా చేసేవాళ్లుంటే సరే. తనేం చేస్తుందిట?"

"నేనడగ లేదు"

"అయితే అది యింటో పడేసి రా"

"ఎందుకూ?"

"కందులు వేయించాటప్పటికి అమ్మమ్మకి వొళ్లు హూనం అయిపోయిందిట"

"ఊహూ"

"నన్ను మీ నాన్న తల అంట మంటున్నారు. నేనే కాని పనికిరాదుట"

"ఊహూ"

"అమ్మమ్మ తనమ్మకి కాస్త వుప్పుపిండో, మినపరొట్టో చేసుకుంటే చేసుకుంటుంది, లేకపోతే మానేస్తుందిట"

"ఊఁహూ"

"నువ్వు వంటచెయ్యాలి"

"..............................".

"తప్పూటకే. రేపు నేను మడికట్టుకుంటానులే"

"కందులు బాగుచేశాటప్పటికీ, గంధం తీశాటప్పటికీ నాకు రెక్కలు పడిపోయాయే"

"పొయిదగ్గిర కూచోడమే కాదూ, రుబ్బాలా పోటు వెయ్యాలా ?"

"..............................."

"అరటికాయ వప్పుగా వేసి, చారు గాచు మరేమీ అక్కర్లేదు. మామిడికాయల పచ్చడి మాత్రం కాస్త రుబ్బు"

"..............................."

"పచ్చడి చద్దిఅన్నాల్లోకి వుండాలినువూ...మరి లే"

"పెద్దక్కనేనా, చిన్నక్కనేనా వండమనరాదూ ఏం ?"

"వాళ్లెందుకు చేస్తారమ్మా మనకి ? ఇక్కడ మనం వని చెబితే వాళ్ల మొగుళ్లేమంటారో ? అత్తగార్లకేం కోపం వస్తుందో ?"

"..............................."

"వాళ్ళంతటివాళ్ళు వాళ్ళు. మనకి వోపిక వుంటే పెట్టాలి, లేకపోతే పంపెయ్యాలి; గాని పని చెప్పకూడదు"

"..............................."

"వాళ్లకి తోచి చేస్తే—ఇంకెందుకూ! అప్పుడే ఆరయింది. మీనాన్న పెండలాడే వంట కావాలంటున్నారు. లే. కూచోకు. ఆగుడ్డ అవతల పడేసెయ్యి"

"..............................."

"ఆలోచిస్తూ కూచుంటే కాదు. ఇదిగో నేను వెళుతున్నాను మరి. పచ్చడి రుబ్బలేకపోతే చారు మానేసి, మునక్కాడా పనసపెచ్చూ, వంకాయా వేసి పులుసు చేసినా సరే. లేకపోతే అమ్మమ్మ యేం చెయ్యమంటే అది చెయ్యి"

"......ఇస్సు, రామయ్య తండ్రీ !"

౫

"ఏయ్ ! ఎవరు వంటింట్లో ?"

"నేనురా తమ్ముడూ ! ఎందుకూ ?

"నిమిషాలమీద అన్నం పెట్టెయ్యాలి నాకు"

"..............................."

"మాట్లాడవేం ? సినిమాకి వేళ అయిపోతోంది తొరగా వడ్డించు. కంచం పెట్టకోనా ఆకు వేస్తావా ?"

"ఇంకా యెసట్లో బియ్యం పొయ్యాలేదురా"

"ఇంతసేపటి దాకా యేం చేస్తున్నావు మరి ? వెధవ పదింటో ఆటకి వెళితే రేపు చదువు తగులడిపోతుంది. ఇప్పుడేనా బియ్యం పోసెయ్యి"

"ఇంకా యెసరు కాగందే ?"

"సిమొహాం లాగే వుంది వంట. మరి యె—— యెడవడం ?"

"పొడిఅన్నం తింటావా ?"

"ఏడిసినట్టుంది నీమాట......మరి అదే తగలెయ్యి"

"చిన్నక్కనేనా పెద్దక్కనేనా పెట్టమను"

"చిన్నక్క మల్లెమొగ్గలు దండగుచ్చుకుంటోంది. పెద్దక్క పిల్లకి పాలు కలుపుకుంటోంది. నువ్వే పెట్టాలి"

"నేను ముట్టుకోగూడదు"

"అయితే తగులుకు వెధవ ఆచారమూ నువ్వూనూ"

"..............................."

"లేకపోతే పదిగంటలదాకా చచ్చినట్టు మేలుకుని వుండు మళ్ళీ వచ్చి తింటాను"

"..............................."

౬

"ఇవాళ నువ్వు మడికట్టుకున్నావేమమ్మా ?"

"అమ్మ చెప్పింది కట్టుకోమని"

"పెద్దక్క యేం చేస్తోంది ?"

"ఏమో ?"

"చిన్నక్కో ?"

"ఏమో ?"

"అమ్మమ్మో ?"

"......నాలుగు కుంచాల కందులు వేయించాటప్పటికి నానడుం పడిపోయింది. నేనింకా యెక్కడ వండి వడ్డించగలనో య్యా ?"

"సరే అయితే; ఆసంగతి నాకేం తెలుసూ ?"

"ఇదే కాదు, ఇంటి సంగతి యేమీ తెలవడం లేదు నీకు. భోజనం చేస్తావు. వూళ్లోకి వెళ్ళి తిరిగితిరిగి మళ్ళీ వంట అయాటప్పటికి వస్తావు. లేకపోతే మునుగుతిన్ని—చెయ్యలేక నేను చచ్చిపోతున్నాను బాబూ"

"మీ అమ్మాయి యేం చేస్తోందీ ?"

"అది వూరికే కూచుంటోం దనా నీవూహ ?"

"............................"

"వంటలోకి రాదన్నమాట గాని పైనపనింతా యెవరు చేస్తున్నారో యెరుగుదువా ?"

"............................"

"ఇంతకీ: నాశక్తి నన్నగిల్లిపోయింది. నారెక్కలు మూలపడ్డాయి. మునపటిలాగ నేనిక చెయ్యలేను. దీనికి మీ వేదేనా వుపాయం చూడాలి"

"ఔషధం యేదేనా పుచ్చుకోరాదూ ?"

"కాటికి కాళ్లు చాచుకూచున్నదానికి ఔషధాలేమిటోయ్ ?"

"ఇంటిపని మాట దేవు డెరుగును; మీరు సుఖంగా తిని కూచోడాని కేనా—"

"పని చెయ్యలేను కాని నాకేం తెగులా రోగమా? ......పైపని కేమీ బాధ లేదు, వంటదగ్గరే వస్తోంది యిబ్బంది"

"మీ అమ్మాయి వంటలోకే రారాదూ, పైపని రుక్కమ్మ చేస్తుందీ ?"

"చెప్పాను కాదూ ? పైపనులు తెముల్చుకోడంమాత్రం మాటలా ? కాకపోయినా తలచెడ్డవాళ్లిద్దరింటో వుండగా పునిస్త్రీపసుపు మడికట్టుకోడం యేమిటోయ్!"

"............................"

"పైగా పదిరోజులనుంచి దానికి అన్నహితవులేదు కూడానూ ?"

"అయితే మధ్యమధ్య వండిస్తూవుండండి రుక్కమ్మ చేత, రోజూమాత్రం వద్దు"

"అదెలాగా తప్పదూ. అయితే నామాటా ?"

"అంటే ?"

"అది చేసిన వంట నేను తింటాననుకోయ్ ? నీకింత తెలవకుండా వుందేమిటీ ?"

"............................"

"నేను పోయినక్కర పనికొచ్చుకోడం యేలాగా తప్పదు గనక అది కూడా మడికట్టిన అందం యేమిటి, లాభం యేమిటి ?"

"అయితే యేం చెయ్యమంటావూ ?"

"నానోటితో చెప్పాలా ?"

"............................"

"నీకు ఆలోచన తోచే లేదంటావా నిజంగా ?"

"మీరు చెబితే యేమీ ?"

"అయితే—దాని బతుకంతా తెల్లారేపోయింది. ఇంకేమున్నా లేనట్టే"

"కనక ?"

"ఎప్పుడో వొకప్పు డెలాగా తప్పదూ. రోజులు గడవడం తప్ప లాభం యెలాగా లేదూ"

"అయితే ?......ఏమిటి చివరికి ?"

"తల అంటుకోనా, దువ్వుకోనా, జడ వేసుకోనా, యింకెందుకోయ్ దానికి దిక్కుమాలిన జుట్టూ ?"

"............................"

"అదేమమ్మా పుటుకు కింద పోసేస్తున్నావూ ?"

"గరిటె వేడిగా వుండడంవల్ల చెయ్యి వొణుకుతోంది నాన్నగారూ"

"............................"

"ఇందాకా రామదీక్షితులుగారి నడగ్గా యెల్లుండి దశమినాడు మంచి దన్నారు. కోటిలింగాలికి వెడితే వొక్క నిమిషం పని"

"............................"

"నువ్వు శాస్త్రదూరం ఆలోచిస్తే కాని వీలు లేదు. మొగుడు చచ్చిన పడుచుపిల్లలికి మంచిరోజులు కావివి. మొన్ననే వీరేశలింగం తోటకో వొక వెధవపిల్ల

అయింది. ఇంకా నలుగురు విద్యార్థిపీనుగులకోసం వెధవ ముండల్ని వెతుకుతున్నారుట. వాళ్ళ ముహూర్తం లేకుండా, వాళ్ళ సమయా సమయాలు చూడకుండా యేక్షణంలో పడితే ఆక్షణంలో చేసేస్తున్నారుట పెళ్ళిళ్లు. తరవాత యేమనుకున్నా యిక కలిసిరాదు సుమా"

"పదిహేడేళ్ళు నిండలేదుకదా—"

"ఎన్నేళ్లు నిండితే యేం వొరిగిందీ?......పదిహేడేళ్ళు నిండకపోదు కనకనే పాడుబుద్ధులేమీ పుట్టకుండా జాగ్రత్తపడాలి మనం"

"............................."

"నువ్వేమో పిల్లని దయతలుస్తూ వున్నట్టనుకుంటున్నట్టున్నావు. ఇది కొరివితో తలగోక్కోవడం కాని మరోటి కాదు"

"మీ అమ్మాయి యేమంటుందీ?"

"ఎంత అవసరం వచ్చినా తల్లిపీనుగు నోరారా చెప్పగలదా?"

"నేను మాత్రం—"

"నువ్వే చేయించాలి. నీకేం మొగాడవు......కాకపోయినా మీకెవరికీ బాధ లేకుండా నేను చేయించేస్తాను తెల్లవారేటప్పటికి"

"............................."

"అదేమమ్మా నీళ్ళలా వొలకపోశావూ?"

"నేతిజిడ్డుమూలాన చేతిలోనుంచి చెంబు జారిపోయింది నాన్నగారూ"

"............................."

"చూశావా?......ఇదీ వరస. ఒక్క పని చేత కాదు. చేసినంతమట్టుకేనా వొబ్బిడీ, నిదానమూ యేమీ లేదు......తిని కూచున్నట్టే వుంటుందా వండి వడ్డించడం అంటేనూ?"

"............................."

"నీకిదే చెప్పడం. దశమీ బుధవారం తప్పదు... వినపడిందా?"

"చెవుల్లో హోరు పుట్టుకువస్తూంటే వినపడకపోవడం యేమిటండీ?"

"............................."

౭

రుక్కమ్మ, వంటింటికి గొళ్ళెంపెట్టి తన పక్క మీదకి వచ్చేటప్పటికి పదకొండున్నర అయింది.

అప్పటికప్పుడే యింటిల్లిపాదీ గాఢనిద్రలోవున్నారు. ముసలమ్మ వసారాలో పడుకుని బావురుపిల్లులతో కొట్లాడుతూ వుంది.

అక్కడికి తానెలా వచ్చిందీ రుక్కమ్మ యెరగదు. వచ్చిరావడంతోటే కాళ్లు తేలిపోగా ఆమె మంచం మీద వెల్లకిలా పడిపోయింది.

దీపం బాగా స్పష్టంగానే వెలుగుతోంది; కాని ఆమెకి అంతా అంధకారబంధురంగా వుంది. పైగా దెయ్యాలూ, భూతాలూ వచ్చి తన శరీరం కండలు కండలుగా పీకేస్తూ రక్తం పీల్చేస్తూవున్నట్టుంది.

ఇలాగ అయిదునిమిషాలయినాక ఆమె కొంచెం తెప్పిరిల్లింది; కాని మనస్సు మాత్రం నేలమీద పడ్డ పాదరసంలాగ చెదిరిపోతూనే వుంది.

ఆమెకి, అసలేమీ తోచడమే లేదు. తోచినా బోధకావడంలేదు. అయినా నిలవడం లేదు. నిలిస్తే మళ్లీ అంతట్లో అంతా అయోమయమూ, అడివీ, ముళ్లూ అయిపోతోంది.

కష్టంమీద ఆమె నాలుగు నిమిషాలు కళ్లు మూసుకుంది; కాని యిక ఆగలేకపోయింది. కళ్లు తెరిచేటప్పటికి రైకగుడ్డ చేతపుచ్చుకుని కొరకొర చూస్తూ చిన్నక్క వొక వేపునా, జుబ్బాగుడ్డ పట్టుకుని పళ్లు కొరుకుతూ పెద్దక్క వొక వేపునా, పీటమీద కూచుని విస్తరి తుడుచుకుంటూ వురుముతూ చూస్తూ తమ్ముడొక వేపునా, కత్తి నూరుతూ మంగలి కూడా రాగా స్వయంగా కత్తెర పుచ్చుకుని అమ్మమ్మ వొక వేపునా, రెక్కలు పడిపోయేలాగ తాను తీసిన గంధం అంతా వుడుకులాం కలిపి పూసుకుని, బుగ్గాబుగ్గా ఆనించుకుని సుఖంగా—తల్లీతండ్రీ వొక వేపునా—రుక్కమ్మకి వొళ్లు తెలవలేదు. మనస్సు గుబగుబలాడిపోయింది. నరాలు పొంగిపోయాయి.

ఇక ఆమె వడుకోలేక గభీమని కూచుని, కూచున్న పాళంగా లేచి నుంచుని, నంచోడం తడువుగా వాకిట్లోకి వచ్చి, వచ్చిన వెంటనే వీధితలుపు తెరిచి, తెరిచిన వెంటనే వీధిలో—అంధకారంలో—సుడిగాలిలో పడి దిక్కు తెలవకుండా బయలు దేరింది.

ఇలాగ, ఆమె, తానెక్కడికి వెడుతూ వున్నదీ, యెక్కడికి వెళ్లవలసిందీ తెలవకుండా—ఆవిషయమే స్మరించుకోకుండా నడుస్తోందా, పరిగెడుతోందా అన్నంత వడిగా వెడుతూ వుండగా వొక గోడవార బండిలో వడుకుని చుట్ట కాలుస్తూవున్న బండివాడు పలకరించాడు.

"బండి కావాలా?"

"............................"

"మేఘాలమీద యెగిరిపోతేనే డబ్బివ్వండి"

"............................"

"అర్ధరాత్రివేళ కుక్కలో నక్కలో, తెల్లో పాములో—అర్ధలా, రూపాయలా, పావలాడబ్బు లివ్వండి"

"ఏపేట నీది?

"దానవాయిగుంట"

"ఏం పుచ్చుకుంటావూ?"

"పంతులుగారి తోటకా?"

ఇలా అడుగుతూ బండివాడు యెదటికి వచ్చి "బండెక్కం డమ్మాయిగారూ! నిమిషాలమీద తోలుకుపోతాను" అన్నాడు.

"నాదగ్గిర డబ్బు లేమీ లేవు"

"పంతులుగారి తోట కయితే నాకేమీ యివ్వ నక్కరలేదండి"

ఇలా చెబుతూ వాడు గుర్రాన్ని పూన్చి బండి వడి వీధిలోకి తీసుకురాగా ఆమె మాట్లాడకుండా యెక్కి కూచుంది.

గొరడా ఛెళ్లు మంది.

"నాకూ తెలుసునం డమ్మాయిగారూ కష్టసుఖాలు. నాకు వొక్కత్తే కూతురండి. అది యీడేరకుండానే మొన్న మొన్ననే దాని మొగుడు చచ్చిపోయాడండి. దాన్ని చూసినా, తలుపుకి వచ్చినా నాకు కడుపు చెరువయిపోతూ వుంటుందండి......పంతులుగారి తోటలో మొన్న రెండు పెళ్లిళ్లయినాయండి. సిన్న యింకోటయిందండి. మరొకటి కూడా అయిపోయాదే గానండి నగం దారిలో తండ్రీ అన్నలూ నాబండే అటకాయించి ఆ అమ్మాయిగారిని తీసుకపోయా రండి. మరో పిల్ల కోసం వెతుకుతున్నా రండి తోటలోవారు. మహా బాగుంటా రండి రాచకోమారుడు లాగ ఆ అబ్బాయిగారు. నెలకి యాభై రూపాయల జీతమంటండి. అక్కడ దిగగానే మీకు పెళ్లి చేసేస్తారండి. బాగా పుణ్యం చేసుకున్నా రండి మీరు. భయపడకం డమ్మాయిగారూ! ఇక మీ కష్టాలు—"

నిజంగానే, జట్కా, మేఘాలమీదే యెగిరిపోవడం వల్ల ఆఖకసిన్ని మాటలే వినిపించాయి.

ప్రబుద్ధాంధ్ర అయిదో సంపుటం

అయిదో సంపుటం బాపతు విడిసంచికలు పన్నెండూ రఫ్ కాగితాలవి అమ్మకానికి సిద్ధంగా వున్నాయి. వెల ఒక రూపాయి. పోష్టుఖర్చులు కలిపి మొత్తం ౧–౪–౦ ముందు పంపేవారికి వెంటనే పంపుతాము. వీ. పీ. చెయ్యము. ౧౨ సెట్లులే వున్నాయి. ఇదే సంపుటం గ్లేజుప్రతి బయండింగులో వుంది. అర్ధ కాలికో బయండు చేయబడుతోంది. వెల పోస్టేజీతో ౨–౧౨–౦.

కలాభివవర్ధనీ పరిషత్తు—రాజమండ్రి

పూలదండ—ప్రేమపాశం

శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారి చిన్నకథలు పూలదండ అనే పేరిటో సంపుటాలుగా ముద్రించబడుతున్నాయి. మొదటి సంపుటం అచ్చులో వుంది. వెల ౦–౧౨–౦. శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారి ప్రేమపాశం అనే నాటకమున్ను అచ్చులో వుంది. వెల ౦–౧౨–౦. ముందుగా ౧–౫–౦ పంపేవారికి యీ రెండూ అచ్చుకాగానే పోస్టేజీ మేమే భరించి పంపుతాము.

కలాభివర్ధనీ పరిషత్తు—రాజమండ్రి

ఆంధ్రభాషా వాచస్పత్యము

గన్నవరపు సుబ్బరామయ్యగారు: విద్వాన్ టి. ఆర్ముగంపిళ్లైగారు

భావసంవత్సర మాఘమాస భారతి సంచికయందు "ఆంధ్రవాచస్పత్యము" అను వ్యాసమొకటి ప్రకటితమయినది. తత్కర్త శ్రీ అయ్యలసోమయాజుల సుబ్బారావుగారు. 'ఆంధ్రవాచస్పత్య' మను పేరున '(బ్రహ్మశ్రీ కొట్ర శ్యామలకామశాస్త్రు)లవారు రచియభాషల యందును (?)' 'ప్రామాణికమున్న' 'పర్యాయపదనిఘంటు' వంటు ప్రకటింపబడినది. 'ఇది యాంధ్రభాషామహామణికి నవీనాలంకారము.' 'ఇది ఆంధ్రసాహిత్యమునకు గొప్పలాభము.' అని యానిఘంటువును మిన్నుముట్టకేసిరి. సుబ్బారావుగారు మచ్చున కొండొకరండుపదముల నుద్ధరించిరి. వానిలో 'అంశము' అనునదొకటి. దాని యర్థవివరణము లిట్లున్నవి: ["అంశము—సం. వి. అ. పుం. 1 పంపకము: చూ. భాగము 1; 2. పాలు: చూ. వంతు 5; 3. కిరణము: చూ. మయూఖము 1." * ఇందు మొదటియర్థము 'పంపకము' అని కలదు. 'పంపకము' అనగా 'పంచుట' అనియర్థము. 'అంశము'న కీయర్థమున్నట్లు కనుపడదు. మూఁడవయర్థము 'కిరణము.' ఈ పదమున కీయర్థ మేనిఘంటువునను గానరాదు. 'అంశువు' అనిన 'కిరణ' మగును. ('కిరణోస్రమయూఖాంశుగభస్తిఘృణిఘృష్టయః' అని యమరము.) 'అంశము' అకారాంతపదము. 'అంశువు' ఉకారాంతపదము. ఇట్టిపదములు రెండును స్వరూపమునను, అర్థమునను విభిన్నములయినవి.

ఇంకొకపదము [అపరాజితము...ఇంద్రుని పేరు.] ఈ యర్థమీ పదమునకు మృగ్యము. ఇట్టిపేరును అశ్రుతపూర్వము. ఇట్లే మరికొన్ని విషయములు నందపూర్వ్యముగ గోచరించినవి. నిఘంటుప్రశస్తి ప్రకటనముకొరకు ఉద్ధృతమయిన యల్పమాత్రనిఘంటుభాగమున గోచరించిన యీయపూర్వత నిఘంటుసమగ్రపరిశీలనమునకు పురికొల్పినది.

నిఘంటుకర్త ప్రకటనము ననుసరించి యీ యాంధ్రవాచస్పత్యము ఇంచుమించు ౨౫౦౦ పుటల పరిమితిగల యొకబృహన్నిఘంటువు. 'నూఱుపుటలు' గలసంచిక నెలకొకటిచొప్పున వెలువడుచుండును. దీనికి మహారాజపోషకులు, రాజపోషకులు, 'సహాయులు.' చందాదారులు పలువురు చేరినారు. ఇట్లును కానివారికి దీనివెల యిరువదియయిదురూపాయలు. ఇప్పటి కారుసంచికలు (౬౦౦ పుటలు) వెలువడినవి. ఆరవసంచిక చివరిపదము 'ఓరమి.'

ఈ నిఘంటువున 'అంశము' అనుపదము నర్థవివరణాదుల సుబ్బారావుగా రుదహరించిన మాత్రమేకాక యింకను తరువాయి యిట్లున్నది: [4. గడ్డి మొదలగువాని ప్రోగు: చూ. మేటి 8; పా. 5. జ్యామానము' మున్నగుదానిలోని (0) అను గీతను 100 అను గీతను మధ్యభాగము 100 భాగములుగా విభాగింపఁబడి యుండు విభాగములు; 6. కోణమితిలోని 360 భాగములు; అం. 7. అష్టాదశ మహాపురాణములయొక్క నామములలో మూఁడవదగు వైష్ణవము. ఇది 6 అంశములు కొనిమిదివేల శ్లోకములు గలది.] దీని నాలవయర్థము మృగ్యము. అయిదవ, ఆరవయర్థములు బహువచనమున నున్నవి. ఏడవయర్థ మగమ్యగోచరము. ఈపదమునకు దరువాత దీని బహువచనరూపము 'అంశములు' అనునది యున్నది. ఈబహువచన రూపపదము నర్థమునకు, పూర్వోక్త—ఏకవచన రూపపదము నర్థమునకు సంబంధము లేదు. దీని యర్థమాత్రయు సంగీతశాస్త్రవిషయము. ఇందలి పదములకూర్పు, అర్థప్రవచనము, వాక్యరచనము, అన్వయక్రమము నిట్లు వింతరూపమును దాల్చినవి. ఇప్పటికి వెలువడిన ఈ 'యాంధ్రవాచస్పత్య' భాగమంతయు నించుమించుగ నీతీరుననే యున్నది. ఇందు నుదాహరణముగ స్థూలదృష్టికి గోచరించిన యీక్రిందిపదసముదాయమును గమనింపదగును :

[అంతర్హితవ్యక్తిత్వము. వా. దానిలోనే యిమిడియున్న సందేహార్థము.] ఇది యేమిపదము, ఏమియర్థము ?

[అంప. క్వ. వి. అముక్త. అంపకోల: చూ. బాణము 1.] ఈపదము సమస్తపదమునందలి భాగము; ప్రత్యేకపదము కాదు.

[అంబిక. సం. వి. అ. స్త్రీ......... 4. మాతులాని, తండ్రితోఁడబుట్టినది: చూ. మేనత్త.] 'మాతులాని' అనిన మేనమామ భార్యకాని తండ్రితోఁడబుట్టినది కాదు. 7 వ అర్థమున 'మేనమామ భార్య' అనికలదు. 'మాతులాని' శబ్దమున కర్థము తెలియమిని పడిన పాట్లివి.

[అంబుభూషణము, సం. వి. అ. పుం. నీటిరేఁడు: చూ. వరుణుఁడు 1.] అమహద్రూపమునకు మహద్రూపమునర్థము తప్పు. ఈపదమున కీయర్థమును మృగ్యము. ఈపదమునకుతరువాత 'అంబుభూషణుఁడు అంబుభూషితుఁడు, అంబుభూషుఁడు' అను మూఁడు మహద్వాచకము లున్నవి. పైపదము నర్థమే వానికిని చెప్పఁబడినది. ఇదియంతయు వ్యర్థమగు పెంపు.

[అఁట. దే. అవ్య......4. ద్ర. 2. అచ్చట, అంద. "అఁటఁ జనిఁగాంచె" స్వా. 1. ఆ. మా. తత్ర.] ఈపద మీయర్థమున సబిందుకము కాదు. నిఘంటుకర్త శబ్దస్వరూప నిర్ణయజ్ఞానదారిద్ర్య మాంధ్రకవితాపితామహున కిట్లు సబిందునిర్బిందు ప్రాసప్రయోగ కళంకమును దెచ్చిపెట్టినది.

[అఋణి. సం. విశే. ఇ. అప్పులేనివాఁడు: చూ. అనృణి.] ఈపదము నకారాంతము; ఇకారాంతము కాదు. 'అనృణి' అను పదమును గలదు. అదియు ఇకారాంతముగనే పేర్కొనబడినది.

[అక్షణప్రభ. సం. వి. అ. స్త్రీ. 1. మెఱుపు: చూ. విద్యుత్తు 1; 2. విషామృతము: చూ. అభ్రమువు.] 'అక్షణప్రభ' తప్పు. 'క్షణప్రభ' ఒప్పు. 'విషామృతము' అనగా నేమి ?

[అక్షతము. సం. వి. అ. న. 1. కొజ్జా: చూ. సౌవిదల్లుడు.] ఈపదమున కీయర్థము కనుపించదు.

* [ ] గుర్తులలోనిది నిఘంటుభాగము.

[అక్షధూర్తలము...(రూ. అక్షధూర్తిలము)] మొదటిది తప్పు.

[అక్షవిశారదుఁడు. సం. వి. అ. పుం. నలచక్రవర్తి: చూ. రాజు 1.] దీని కీయర్థము తప్పు. 'అక్షవిద్యనెరిగినవాఁడు' ఒప్పు.

[అగచాటు. ద్వ. వి......2. కష్టము: చూ. దుఃఖము.] 'అగసాటు' కాని 'అగచాటు' కాదు. ఈపదమునకు 'కష్టము' అను అర్థము లేదు. 'అగచాటు' అనిన కష్టము. 'అగచాటు' 'అగసాటు' పదములును కలవు. ఇది యంతయు 'చా' 'సా' లిపులభేదము తెలియమిని వచ్చిన యగచాట్లు కావలెను.

[అగ్నిమిత్రుఁడు. సం. వి. అ. పుం. శూద్రుఁడైనరాజు: చూ. రాజు 1.] అగ్నిమిత్రుడు వేఱు; శూద్రకుడు వేఱు.

[అగ్నిమూల. సం. వి. అ. స్త్రీ. ఆగ్నేయమూల: చూ. ఆగ్నేయి.] ఇది సంస్కృతపదము కాదు.

[అగ్రగణ్యుఁడు. సం. వి. అ. పుం. అత్యుత్తముఁడయినవానిగా పరిగణింపఁబడినవాఁడు: చూ: శ్రేష్ఠుఁడు 2.] ఇది విశేషణపదము; విశేష్యపదము కాదు. 'వానిగా' ఏమిటి? ప్రతికాపదవాండిత్య జన్యము కాబోలు!

[అఘాయువు. సం. వి. అ. పుం......]

ఇది విశేషణపదము, విశేష్యపదము కాదు. అకారాంతమును కాదు; సకారాంతము. ఈపదమునకు చెప్పినయర్థములు విచార్యములు.

[అడవిపుట్టువు. ద్వ. వి. ఐరావతము ఇంద్రునియేనుఁగు: చూ. హస్తి] ఈపదమున కీయర్థ మెట్లు వచ్చినది?

[అడ్డంకి. వై. వి. = అటంకమ్: అడ్డము: చూ. నిరోధము 1] అటంకశబ్దమునకీయర్థము లేదు. 'అడ్డంకి' ఆటంకశబ్దభవమును కాదు.

[అడుగుదాఁటు. దే. స. క్రి. అ. క్రి. అతిక్రమించు. "నీ. కాక్షణజితపద్మ నీతనినేత్రమమున విమతపద్మములంగవింపఁజాలు." నై. 6. ఆ. 145: చూ. దాఁటు 6.] 'అడుగుదాఁటు' పదములేని యుదాహరణ ముదహరింపబడినది. 'అంగవించు' పదమున కిది యావశ్యకము. అచ్చట నీయబడినదికూడ.

[అడ్డెఁడు, దే. విశే. రెండుమానికలసరకు.] అడ్డ + ఎఁడు (పరిమాణార్థకము)=అడ్డెఁడు. 'ఎఁడు' సార్థబిందుకముగ నుండవలెను. 'సరకు' ఎందుకో!

[అన్నువ. దే. వి. 1. అఁడుది. ఆతివ. చూ. స్త్రీ......[ఈపదమున కీయర్థము లేదు. 'అన్ను' అనిన అఁడుది.

[అన్యథా. సం. అవ్య. మఱియొకవేళ] ఈయర్థము తప్పు. 'అన్యప్రకారము' మొ. ఒప్పు.

[అన్యథా. సం. అవ్య. మఱియొకలాగున.] ఈపదము లేదు.

[అన్వేష్టరి. సం. విశే. అనుపది: చూ. వెదకెడువాఁడు.] ఇది అన్వేష్టృశబ్దము సప్తమ్యేకవచనము అని తెలిసినట్లు లేదు 'నిఘంటుకర్తకు.

[అబ్బాటు. దే. వి. 1. అకస్మాత్తు: చూ. హమ్మాటు......] పదము, అర్థముకూడ తప్పు.

[అభ్యంగనవిధి, అభ్యంగనవిషేకాలము] ఈపదములు తప్పు. 'అభ్యంగము' కాని 'అభ్యంగనము' కాదు. 'అభ్యంజనము' అనియు కలదు.

[అభ్రముపు. సం. వి. ఉ. పుం. ఇంద్రుని యేనుఁగు. ఐరావతము చూ. హస్తి] ఇది యొక అభ్రాన్త శబ్దసృష్టి.

[అభ్రము. సం. వి. ఉ. స్త్రీ. 1. అభ్రకము...2. కర్పూరము, ఆకసము; 3. మబ్బు......4. సువర్ణము, బంగారు ......5. సురలోకము, వేల్పుటుంకి; 6. ఇంద్రదిగ్గజముభార్య.] ఇది అభ్రము, లింగము, అర్థము అన్నియు తలక్రిందులయినవి. దీనితర్వాత [అభ్రముప్లభుఁడు. అం. చూ. అభ్రము. 6.] అని కలదు. ఈసంపుటి 'అభ్రముపల్లభుఁడు' అనుపదమునకు 'ఇంద్రదిగ్గజముభార్య' అని యర్థము. పుంలింగశబ్దమునకు స్త్రీలింగార్థము! వింత! ఇంకను వింత: [అభ్రముపు. అం. 1-వై-; 2. విహాయసము: చూ. అభ్రము 2.] ఇకర్తృపైను పదార్థముల లింగవ్యత్యయము !! 'విహాయసు' మేమిరయో!

[అతి. అప. వాకవాక్యమై రూపాంతరమువంద వచ్చినరపత్యయము రూపతి, సాంపతి. మొ. ఇదిక్తాప్యర్థము.] ఈవివరణ మెంతయు నస్ఫుటముగను గోలుపుమన్నది.

అవంతయము. సం. వి. అ. పుం. ఒకానొకదేశము. "ఏష పాంశుకటకస్తస్య బాహ్లాకాద్యుత్తరదక్షిణ దాశేరకామయసు వోమాలమా(వా)స్యుదవంతయః "త్రి. శే. భూ. చూ. దేశము.] ఆవంతిః. అవంతీ అను ఇకార ఈకార—అంతపదములకు బహువచనరూపమయిన 'అవంతయః' పద మిట్లు 'అవంత యము' అను వికృతరూపమును పొందినది.

[అయోగుఁడు. సం. వి. అ. పుం. వైశ్యస్త్రీకి శూద్రునివలనఁ బుట్టినవాఁడు; 2. భార్యా వియోగముగలవాఁడు.] రూపము తప్పు 'అయోగవుఁడు' ఒప్పు. "శూద్రాదాయోగవః క్షత్తా" మనుస్మృతి. వర్ణాంగము క్షత్తవ్య. రెండవయర్థము మృగ్యము.

[అరము. దే. వి. 1. అఱవభాష, ద్రావిడభాష: చూ. భాష 1......] 'అఱవభాష' తప్పు. 'మహారాష్ట్రభాష' ఒప్పు.

[అలప్యాలము. సం. అవ్య. పలుకవలదనుట.] ఇది యేకపదము కాదు. అలప్య, అలం అనురెండు ప్రత్యేకములగు అవ్యయములు.

[అవరింత. దే. వి. 1. రూ. అవలింత: చూ. వాఖిక...] ఈపదము తెలుగుభాషయందు మృగ్యము. 'ఆవులింత' నిర్దుష్టము. ఇంకదియు కలదు.

[అశ్రయాసి. సం. వి. స. పుం. అగ్ని: చూ. నిప్పు.] ఈరూపముగలపదము లేదు.

అలీనలులాయము. అలీనమీనము, అలానశాకీకలము. అనరూ పాలింగనము, అన్యోన్యబంధుసంఘనము, అన్యోన్యకీటసదము, అతిగంధము, అనందోబ్రహ్మ, ఇంద్రమహోత్సవము. ఏనోనికురుంబము ఇత్యాదులగు పదములెన్నియో యుండెక్కువవి.

[ఇతఃపరము. సం. క్రి. విశే. అనః చూ. ఇంతకుమన్న.] ఇది యుక్తగోడెవ. 'ఇంక మీదట' అనియుండవలెను. ఇది (ఇతఃపరం) అవ్యయము. దీనికి అంతము, లింగము మొ. లేవు.

[ఇద్దుగ. ద్వ. వ. (ఇరు + దుగ) చూ. రూ. ఇత్రిగ. "క. ఆ త్రివంబి త్రిగదుగ......దొచ్చున్." ఉ. హరి. ౩. అ. 121.] 'ఇద్దుగ' వేరు. ఇత్రిగ వేరు. 'ఇద్దుగ' రెండు రెండ్లు. 'ఇత్రిగ' రెండు మూళ్లు.

[ఇథము. అవ్య. ౬. ఈలాగు: చూ. ఇటు.] ఈ పదము తప్పు. 'ఇత్థము' ఒప్పు.

[ఇప్పిశోలు. దే. వి. ఇచ్చగింతి: చూ. సమ్మతి. 1] ఇట్టిపదము తెనుగున అపూర్వము.

[ఇరుపేద. దే. వి. మిక్కిలి పేదవాడు: చూ. బీదవాడు.] ఈపదము తప్పు. 'నిఱుపేద' ఒప్పు. 'ఇరు' 'నిఱు' శబ్దములు సమానార్థకములు కావు.

[ఇల్లొదాల్పుబాట. ద్వ. వి. అచ్చిమగడు: చూ. విష్ణువు. 1] ఆకయువార్థము కాదిది. ఇట్టి విందు లెక్కకు మిక్కిలిగ నున్నవి.

[ఇష్టాపూర్తము. సం. విశే. కోరిక నింపఁబడినది.] ఈ యర్థము తప్పు. 'ఇష్టమును పూర్తిచేయుట' అని తలచినట్లున్నది. 'ఇష్టం, పూర్తం' అనుపదములసమాహార మిది. 'ఇష్ట' మనగా యాగాది కార్యము: 'పూర్తి' మనగా కూపతటాకఖనన దేవాలయనిర్మాణాది కార్యము.

[ఈ (?) టియ. దే. వి. కుంతలమను బాయుధము...]'కుంత' అను క్రొత్తఆయుధము కాబోలు.

[ఈడుపాయము. ద్వ. వి. ప్రాయము చూ. వయస్సు 1.] ఇది యేకపదము కాదు. రెండుపదములు: ఈడు, పాయము. ఇవి సమానార్థకములు. 'ఈడు' పదము 'ఈడులేనివాఁడు' అనుపదమున సాదృశ్యబోధకముగ నున్నది.

[ఈత్వరి. సం. వి. ఈ. స్త్రీ. కులట.....] ఇది తప్పు, 'ఇత్వరి' ఒప్పు.

[ఈరాలు. దే. వి. బ. తుప్పు. చూ. బొద 2.] బహువచనపదమున కేకవచనమర్థము. మరియు తుప్పు వేరు.

[ఈవు. దే. స. 1 నిశబ్దమునకు ప్రథమైకవచనము......అవ్య. 2. ఒసంగవు. చూ. రూ—ఇయ్యవు.] ఒకటవఅర్థమున అవ్యయము కాదది. 'ఇచ్చు' ధాతువునకు మధ్యమపురుషైకవచనము, వ్యతిరేకార్థకము.

[ఉక్కు. వై. వి. 1 = ఉల్కు. ఉమ్మ......2. ధైర్యశాలి: .....] ఇది ఉల్కుశబ్దభవము కాదు; దేశ్యపదము. రెండవయర్థము వ్యాగ్యము.

[ఉచ్ఛ్వసనము. సం. వి. అ. న. ఊపిరివిడుచుట.] కాదు. ఊపిరిపీల్చుట. దీనికి పర్యాయములగు పదముల కన్నిటికి నర్థమిట్లే కలదు. 'ఉచ్ఛ్వాసనిశ్వాసములు' అనుదానికిమాత్రము 'ఊపిరిపీల్చుట, విడుచుట లోనగునది' అనికలదు. ఇట 'లోనగునది' అనుట యేలనో!

[ఉజ్జగము వై. వి. విడుపు:......] 'ఉజ్జనము' కలదుకాని 'ఉజ్జగము' కానరాదు.

[ఉడవు. సం. వి. ఉ. స్త్రీ. 1 ఒకనక్షత్రము.] ఇది నక్షత్రసామాన్యవాచకము కాని ప్రత్యేకమొక్కదానిపేరు కాదు.

[ఉదురు. సం. వి. ఉ. పుం. 1 ఎలుక] తప్పు ఈ పదము. 'ఉందురువు' ఒప్పు.

[ఉద్రథము. సం. వి, అ. పు. 1. కుక్క. చూ. శునకము...] ఈయర్థము వ్యాగ్యము. ఈపదమునకు 'రథకీలము' అనునర్థము కలదు. అది యుందు లేదు.

[ఉన్నతానతము. సం. విశే. (అ, అ. అ) వంగినది: చూ. బంధూరము.] మెరక పల్లములుగలది అనవలెను (Elevated and depressed.)

[ఉప్తకృష్టము. సం. విశే. (అ. అ. అ.) దున్ని విత్తులువేసిన పొలము: చూ. భూమి. 1.] పదము తప్పు. 'ఉప్తకృష్టము' ఒప్పు. అర్థమును తప్పు. 'విత్తనపిదప దున్నినపొలము' ఒప్పు. 'బీజాకృతము ఉప్తకృష్టం; బీజవపనానంతర కర్షిత క్షేత్రము.

[ఉపోధుఁడు. సం. విశే. (అ. ఆ. అ.) అంసలుఁడు: చూ. లావరి] ఈపదమున కీయర్థము కానరాదు. 'అంసలుఁడు' అను నర్థమునిచ్చి 'చూ. లావరి' అన్నారు. 'అంసలుడు' అనిన 'బలిసినవాడు' 'లావరి' అనిన బలముగలిగినవాడు. రెండు సమానార్థకము లనుకొనుట భ్రాంతి.

[ఎడపక. దే. అవ్య. ఎడతెగవిక్రియ. "క. ఎడపక క్రతువులు దపములు" వేమన. 614 చూ సతతము.] 'ఎడపు' ధాతువు వ్యతిరేకక్త్వార్థక మిది. దీనియర్థము 'నిరంతరముగ' నని. 'క్రియ' ఎందుకో!

వీరి 'ఎలుక' ఎలక, ఎలుక, ఎలిక, ఎలిక ఎలుక ఇత్యాదులగు రూపములను పెక్కింటిని దాల్చినది. ఇన్నిరూపములు ఎలుకబోను, ఎలుకవల, ఎలుకచెవి మొదలగు సమస్తపదములలోను వచ్చినవి. ఇట్లు బహురూపములను పొందిన పదములు నూరులకొలది నున్నవి. 'ఆంధ్రవాఙ్మయమహోదధి' నిఘంటుకర్త! శబ్దదారిద్ర్యము వీరికింతయైన పట్టదు.

[ఎత్తిపోఁత. పా. శవమును కాల్చిన భస్మములను సంచయనానంతరమున ఎత్తి నీటఁబోయుకర్మ: చూ. సంచయనము.] అర్థము వాక్యరచనయు నపూర్వపాండిత్యమును ప్రకటించుచున్నవి.

[ఏతలము. వై వి.=ఏకల, వనసూకరము.] ఈపదము తప్పు.

[ఏనాంసి. సం. వి. ఇ. న. బ. దోషములు: చూ. పాపము.] ఈపదము ఇకారాంతము కాదు. సకారాంతనపుంసక లింగమగు 'ఏనస్' శబ్దమున కిది బహువచనరూపము.

[ఏబరాసి. వై. వి.=ఐభ్యరాశి, అం కేద: చూ. ఎంబన్న.] ఐభ్య రాశిపదము మృగ్యము.

[ఒకా్కణించు. వై. వి...చెప్పు.] 'ఒకా్కణించు' కాని ఒకా్కణించు' కాదు.

[ఒచ్చుబడి...] 'వచ్చుబడి' అనవలెను.

'అలంకారము' పదము సరివివరణాదులతోఁగల విచిత్రపద ములలో నతివిచిత్రములుకొన్ని: [స్నేహతుయము] ఇది అలం కారము కాదు పరిసంఖ్యాలంకారోదాహరణమునగల పదము. [అన్యత్పర్యాయోక్తము, అన్యద్విషమము, అన్యాతుల్యయోగిత, అన్యత్పర్యాయోక్తి, అన్యావినోక్తి, అన్యాసంగతి, అపరాతుల్య యోగిత. అపరాసంగతి. అపరంవిషమము] వీని నంటియున్న అన్యత్, అన్య, అన్యా, అపర, అపరాపదములు ఆయాయలంకార ముల నేకవిధము గలదనుటను తెలుపునవి. ఇది తెలియక ఏక పదములుగను, ప్రత్యేకాలంకారములుగను పఠింపబడినవి.

ఒక, ఒకడు, కొమరుఁడు, కొమరిత ఎవతె ఇత్యాదిపదములకు గల యసంఖ్యరూపాంతరములను, సమానార్థకములగు వానిని ప్రత్యే కపదములుగ నుదహరించుటచేత గ్రంథము విపరీతముగ పెరిగినది.

ఇంకను అసంబద్ధములగు సమస్తపదములు సంస్కృతాంధ్రాంగ్ల భాషలవి యిందు చేరినవి. మచ్చునకట్టివి కొన్ని:

[అతిదీర్ఘాత్రిహస్వాంగము, సం. వి. అ. న. విధవాలక్షణము: చూ. లక్షణము. 1]

[అతిస్థూలమహోకృశాంగము.] ఇదియు 'విధవాలక్షణ' మట.

[అత్యధికకేంద్రీకరణము. పా. మిగుల సూక్ష్మమగు మధ్యభాగ మును గనుగొనుట.]

[అత్యవసరసందర్భవ్యయము. పా. చూ. అగత్యవ్యయము.]

[అవసరపువ్యాయమూర్తి. పా. కల్లోల సమయములందు ప్రభు త్వ మదనముగ నియమించు న్యాయాధికారి.]

అన్యత్రసంధివైకల్పికము, అనభిహితకర్త. అన్యదేశ్యములు, అప వాదసూత్రములు, అస్మచ్ఛబ్దము, అస్మదర్థకము, ఏకదేశాన్వయము, ఏకవచనబహువచనములు, మొదలగుపదములు వ్యాకరణశాస్త్రసం బంధులు, శాస్త్రివివరణములు కలవి తరచు ఇందువచ్చుచుండును. 'ఏకవచనబహువచనములు' అనుపదముకడ అనేకశబ్దముల కేకవచన బహువచనరూపము లేకరువుపెట్టబడినవి.

అమరావతిస్తూపములు, ఆంధ్రమండలము, ఉత్తరకళింగము, ఉత్తరసర్కారులు, ఎడ్వర్డుఅల్బర్టు, ఎడ్వర్డుదికన్ఫెసరు, ఎడ్వర్డు పట్టాభిషేకము, ఐతిహాసికమండలి, ఐనీఅక్బరీ, ఐమూలపంజ్లి పట్టము, ఒడ్డాదిచోడవరము, ఒడ్డాదిజయంతరాజు, ఒడ్డాదిమత్స్య వంశీయులు, ఒరిస్సా మొదలగు చరిత్రపదములు లెక్కకుమిక్కిలిగ నున్నవి. వీని వింతవివరణమువలన గ్రంథము విపరీతముగ పెరిగినది.

వైద్యజ్యోతిషశాస్త్రములయు, ఇతర శాస్త్రములయు, వాక్య ములు, (ఔషధాదియోగములు) పదములు; గ్రంథములయు గ్రంథ కర్తలయు నామములు; నేటికాలపు పాఠశాలల విజ్ఞానవాచకము లలో నొకత్రోవ, యొకతెన్ను లేనిరూపములతోనున్న విజ్ఞానపాం కేతికపదములు, శాసనములనామములు మొదలయినవియు కొన్ని కొన్ని వ్యక్త్యవ్యక్తస్వరూపములను దాల్చి యీనిఘంటువున జేర బడినవి. సామెతలు, న్యాయములు మొదలయినవియు దీన నెక్కి నవి. వానివిచిత్రవివరణములు కేవలము ప్రహసనములు. వర్గద్వితీయ చతుర్థవర్ణములయు, లఘుగురురేఫములయు సాంకర్యము దీనియం దంతటను గలదు. అర్ధానుస్వారవివేకమును బహుళముగ నుమార్గ మున బడిపోయినది.

ఇందు ఇంగ్లీషుపదములు నెక్కినవి. వానిసౌరునకు మాదిరి కొన్ని. ఇంజక్షను (injuction), ఇండార్సి (endorsee), యంప్లాయిమెం టు (employment), రెప్టిల్సు (reptiless), క్రైసెస్సు (crisis), ఎంబాసిడర్ (ambassadar), ఎక్స్‌క్లూషన్ (exclusion) ఎక్సు పొలటోజి (ఇదేమిటో!), ఎంటర్‌ప్రనార్ (ఇదేమిటో! ఎతిమాలజీ (ఇదియు నేమిటో! కాని దీనికిరెండర్థములు నీయబడినవి: 1. మానవజాతిశాస్త్రము, 2. శబ్దవ్యుత్పత్తిశాస్త్రము. మొదటి అర్థము నకు మూలపదము ethnology. రెండవయర్థమునకు మూలపదము etymology. 'ఎతిమాలజీ' ఇందేదియు కాదు.), ఎమ్యుల్సన్ (emulsion), ఎబ్సిక్కస్స (abscissa), ఏక్షన్ (action), ఏపరే టస్సు (apparatus), ఏవరేజివెలాసిటీ (average velocity), ఒరిజినలు (original), ఇత్యాదులు వందలకొలదులు. actor ను 'యాక్టరు' 'ఏక్టరు' అనియు, advocate ను 'యాడ్వకేటు' 'ఏడ్వ కేటు' అనియు, paper ను 'ప్యాపరు' అనియు, Bombay, brother లను 'బోంబే', 'బ్రోదరు' అనియు, easy ని 'ఈజీ' యనియు, chair ను 'ఛయరు' అనియు నాంగ్లపదములను వికృత ముగ నుచ్చరించు టాంధ్రుల యవ్యక్తవ్యక్తిత్వమున కొక యుపల క్షణము. ఉన్నతోన్నతపట్టభద్రులకు సయితమిది యనివార్యము. ఇట్టి విపరీతవ్యక్తిత్వము నిండెక్కిన యాంగ్లపదములన్నియు నించు మించుగ కొలువోయినవికావు. ఈపదముల యర్థమును చాలవరకు పొందకుండును. ఇట్టిది యీవాచస్పత్యమువైఖరి. దీనిని చూడజూడ నవ్వువచ్చుచున్నది.

ఇదియంతయు నిఘంటుపత్రముల నలవోకగా నటునిటు త్రిప్పు నపుడు కనులకుదగిలినది. ఇట్టి పనికిమాలినచెత్త యెన్నిబండ్లకయిన చాలునంత యీ వాచస్పత్యమునుండి యనాయాసముగ ప్రోగుచేయ వచ్చును గ్రంథవిస్తరభీతి యడ్డుపడకుండునేని. కాని యట్టిపని అనావశ్యకము. దీని నిరుపయోగతను ప్రకటించుటకు, నిఘంటు సంధానమున నిఘంటుకర్త యనధికారితను నిరూపించుటకు నీయు ద్ధృతభాగ మధికాధికము.

ఈ నిఘంటుకర్త యింతలంతలవారు కారు. 'ఆంధ్రవిద్యావాచ స్పతి, జ్ఞానగుణాకర, సాహిత్యసరస్వతి, ఆంధ్రవాఙ్మయమహోదధి' 'బిరుదాంకితులు.' 'లక్ష్మీనారాయణీయ' మను నపూర్వశుద్ధాంధ్ర

నిఘంటువును రచించిన కొట్ర లక్ష్మీనారాయణశాస్త్రిలవారి పుత్రులు. వీరును [illegible]నలో వారికి దోహదపడినవారు. ఇదియంతయు వీరి 'య[illegible]' 'సంస్కృతాంధ్రపాండిత్య'మును, వీరి ప్రజ్ఞను వేనోళ్ల చాటుచున్నది. ఈ నిఘంటువునందలి [illegible]యును చేయువేల నోళ్ళ చాటుచున్నది. అమసాంగ్రహముతో తెలియక వీరి [illegible] మున కేలరో చిక్కుకొనిరో! కాక, 'లక్ష్మీనారాయణీయ'మును రచించిన పండితునకు పుత్రుడను, వారికి అత్యంతసన్నిహితముగ తోడుపడిన (బహుశః వ్రాయసకాడుగ కూడ నుండి?) [illegible] యీ మాత్రపు నిఘంటువును తయారు చేయజాలకపోదునా' అని తలంచి దీనికి దలకొనిరేమోకదా! కావచ్చును. దీనికి 'ఆ. [illegible]ము' అని పేరు [illegible] తెలుపుచున్నారు. ఇది కేవలము [illegible] ప్రమాదము. కాని వీరు [illegible] యుండిన గొప్పవారు అయియుండిరి; ఆంధ్ర నేటి కాలమున ఈ 'ఆంధ్రవాఙ్మయమునకు' [illegible] యుండి యుండినచో యీ సాహససంకల్పము [illegible] నేటి కీ నిఘంటువును [illegible] ఆంధ్రవాఙ్మయము ప్రపంచమునకు చెలరేగి యాంధ్రలోకము [illegible] నున్నది! సత్య రముగ దీనినిగార్చుకున్న ఆంధ్రవాఙ్మయము [illegible]; [illegible]రము బుగ్గిపాలయినను.

ఈ నిఘంటువు సంస్కృతభాగమునకు ప్రధానముగ మాతృక యొకటి యున్నది. అది 'ఆంధ్రటీకాసహితసంస్కృతనిఘంటువు'; 1875 వ సంవత్సరమున నచ్చుపడినది. అదియొ? తప్పులతడక. ఇతరసంస్కృతాంధ్రనిఘంటువుల [illegible] చిత్రాతిచిత్రములగు పదములు, నర్థములు [illegible]. ఈ నిఘంటుకర్త [illegible] ఘంటువు తమ [illegible] పరిశ్రమను, [illegible] ప్రకటితము కావలయుననుకొనిరో [illegible] నిఘంటువునందలి క్రమమునుసైతము తారుమారు చేసి [illegible] తప్పులలెక్క [illegible] పెక్కింతలు పొడిగించినారు. ఇతరనిఘంటువులపదములు [illegible] ప్రవేశించినవి. కాని వానియర్థవివరణాదులును [illegible]యినవి. ఇట్టినిఘంటువు 'తమకవిత్వము కొంత, తాత్లవారి కవిత్వము కొంత' కలదిగా తయారయినది. ఇందలి న్యాయములను, [illegible] అకు. ఇంకను పెక్కింటికి, వానియర్థవివరణములకు నంది[illegible] పతిరావుగారి 'ఉపన్యాసదర్పణము' మూలము. ఇతరపదము లనేకములయు [illegible] నిర్ణయములకు మూలము లాంధ్రవిజ్ఞానసర్వస్వాదులు కలవు. వాని నన్నింటిని సంగ్రహించుటకు పోవుట నిఘంటుకర్త గ్రంథచౌర్యమునకు నిదర్శనము. ఇది బుద్ధిపూర్వక మని చెప్పుటకును వలనుగాకున్నది. అజ్ఞానము, అమాయికతయుం దుకు—ఈ నిఘంటుసంధానమునకే కారణమని చెప్పినను చెప్పవచ్చును. ఇది శోచనీయము.

'ఈ నిఘంటురాజమునకు విమర్శకాగ్రేసర మహామహోపాధ్యాయ (?) బ్రహ్మశ్రీ కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రిలవారు విశేషపరిశ్రమ కోర్చి పీఠిక (!) వ్రాయించి (?)' నిఘంటుకర్తను 'కృతార్థుం జేసినారు. అందు వారీనిఘంటువు నతిమాత్రముగ పొగడినారు: "గ్రంథకర్త ఆంధ్రుల ధన్యులఁగావింపనె 'యాంధ్రవాచస్పత్య'మను నిఘంటురాజమును బహుకాలము బహుప్రయాసపడి విరచించిరి. ఇందు నొక్కొక శబ్దమునుగూర్చి యెన్నెన్ని విశేషములు తెలిసికొన వలసి యుండునో నవియన్నియుఁ గరతలామలకముగ నొసంగఁబడియున్నవి. ఇది యాంధ్రసారస్వతమునకుఁ గలిగిన గొప్పలాభము. ఇంతున్న విశేషములతోనిఘంటువులు లేనియుండును లేవు. ఇదివఱకిట్టినిఘంటువు పుట్టియుండలేదు, పుట్టుచు నుండలేదు. ఇందు దవంత [illegible] సంస్కృతశబ్దజాలమును, [illegible] ప్రాకృతశబ్దజాలమును గూడఁ జూడఁగలవు' * * * 'అఖండపండితులు కావుననే యీ యమూల్యనిఘంటువును [illegible] విరచింపగలిగిరి. [illegible] విరచింపఁబడిన వాచస్పత్యమువలెఁ [illegible] చెప్పుటకు సందియమింతయు నుండనేరదు. [illegible] (?) చెప్పవచ్చును. [illegible] స్వభావోక్తియే కాని యతిశయోక్తి కాదు. లోకమీనిఘంటురాజముయొక్క లాభమును బాగుగఁ దెలిసికొని దీనిని దప్పక ప్రతియింట నుంచుకొని సదా వాడుకొని లాభము నొందదగినది" ఈవ్రాత యీ నిఘంటువు కొండ కొనకొమ్మున కెక్కుటకు చేయూత యయినది.

శ్రీ బ్రహ్మయ్యశాస్త్రిగారి విమర్శన స్తనశల్యపరీక్షవంటిది. సంపూర్ణవాక్య సమన్వయమున విమర్శకవకాశమే లేకపోవుచున్నను వాక్యైకదేశగ్రహణమున నవకాశమును గల్పించుకొని గ్రంథముల కొలది విమర్శను పెంచగల సమర్థులు శాస్త్రిగారు. ఇట్టివారీనిఘంటువు నింతగొనియాడిరన్న నేమనవలెను? నిఘంటుకర్తయెడ దాక్షిణ్యమా? తత్పాండిత్యమునందలి విశ్వాసమా? పీఠికయందు ముద్రితములయిన కతిపయపదముల యర్థవివరణాదులను సంస్కరించి పీఠికయందుకేర్చి [illegible] దీరినట్లు సంతృప్తినంది యిట్లు పొగడుటయా? ఇందేదియైనను శాస్త్రిగారివంటివారి కిట్టివిధముల దగని కార్యము. ఇట్టికార్యములు దాక్షిణ్యమునుబట్టి జరుగుచుండుట గలదు. ఇదియు నట్లు జరిగినదే యైనచో జ్ఞానకృతమగు వాఙ్మయద్రోహ మనక తప్పదు. ఇంతేకాక శాస్త్రిగారి పాండిత్యమునకు [illegible] కాకమానదు. వీరిపొగడ్తయం దీక్రిందియొక్క వాక్యము మాత్రమొకటికి సత్యము. 'ఇదివఱకిట్టినిఘంటువు పుట్టియుండలేదు; పుట్టుచునుండలేదు.' ఇకముందిట్టిది పుట్టబోదు. ఇది యూనిశ్చయము.

ఉద్దండపండిత ప్రఖ్యాతులు పలువు రీనిఘంటువు నత్యంతము ప్రశంసించినారు:

1\. వాడెర్ల పురుషోత్తమకవిగారు; వీరు సరసచతుర్విధ కవితాసామ్రాజ్యధురంధరులు. వీరి యభిప్రాయభాగము—

'బిరుదము లెన్నిరో నమరు

పెద్దగు శ్యామలకామశాస్త్రి సు
శిరతరదీక్ష నూని యొక
శ్రేష్ఠనిఘంటు వొనర్చె.'

2. ఘంటాశత గ్రంథకరణధురీణ శతావధాన విద్వత్కవిలోక ప్రాపక నామాంకితులు పండిత భూషణులు శేమూరి శ్రీరామశాస్త్రిగారు; వారి అభిప్రాయైక దేశము :

'** శరపనిఘంటుపుస్తకము
కావలెనన్న పదార్థబోధలన్
కరపమె యానటంచు కవికాంక్షితమై **'

అని కలదు.

3. గోనుగుంట అచ్యుతసూర్యనారాయణశర్మగారు; 'కవిభూషణ' బిరుదాంచితులు. వీరి యభిప్రాయమున విలువగలభాగము.

'ఆంధ్రభాషావస్వాటికి యఖ్యసురభాష
కిసు గాంజాల వయ్యనివిపుడు క్రొత్త
క్రొత్తసాలువులఁ బరికించి కోశ మిట్టు
లొప్పకుంచిన నాంధ్రవాఙ్మయమునకుఁ.'

4. చిలుకూరి చల్లయ్యశాస్త్రిగారు; వీరు వైయాకరణులు.

'ఏపదార్థములందు లోటెంత లేక
సౌమనస్యంబు వాటిల్లు సకలశబ్ద
మాలను చేరిచి కూరిచి పోల్కిలేని
యిట్టికోశంబు రచియింప నేరికగును.

కవిరి.

5. రావూరి దిట్టి వేంకటసుబ్రహ్మణ్యము గారు. బి. ఏ., బి. యల్., వ్రాయుచున్నారు ?

'అంధ్రదాధిని నోలలాడితిని బా
వా, మీ సుప్రజ్ఞావిశే
షానూనంబగు సత్కృతీయాఫలము "వా
చస్పత్యము" గాంచి భా
షానవ్యోత్తమసూక్తిభూషణము, వి
జ్ఞానాదిసర్వస్వమున్
నానాసత్పదమాలవిస్తరణమున్
మాన్యాతిసుశ్లాఘ్యమున్.'

అన్నారు.

6. కిర్లంపూడి సంస్థానకవులు సత్యవోలు కామేశ్వరరావుగారు; అభిప్రాయమిట్లున్నది :

'ప్రభువులయూతలేమి నిలు
వంబడజాలక తూలి భాష బల్
ప్రభ చెడుచుండ నీవు నవ
పద్యనిఘంటువు వింతహైద్యుడై
యొంధయపదంబులం బలుబ
లోన్నతిఁ గూరిచి నిల్పఁబెట్టి దా

నభయమొసంగు మండిడవె
యద్దిర శ్యామలకామధీమణీ!'

7. Komanduri Sitagopachary M. A., B. L., in his 'Foreword' to the book, said:

"The present dictionary will be of great use also to all authors and writers in Telugu."

8. కట్టమంచి రామలింగారెడ్డిగారు; * వీరు ఆంధ్రవిశ్వవిద్యాలయ భూతపూర్వోపాధ్యక్షులు. వీరేమనుచున్నారు ?

'ఇపుడు ప్రకటింపబడుచుండు నాంధ్రవాచస్పత్యము అమూల్యమైన నిఘంటువు. దీనిచే మీరలు మాతృభాషకుఁ జేయుచుండు కృషి ప్రశంసాతీతము. ఇది యొంతయు సమగ్రమైన సంహిత. ఈమహోద్గ్రంథము కాలముగ తెలుగు వసుస్కృతి పండితులు వనుటకు సందేహము లేదు.'

9. అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ఆంధ్రవ్యాసనిపుణ, బాలకవిసింహ, సాహిత్యసామ్రాట్, పండితేత్యాదిబిరుదభూషణాలు వీరు.

'*** శబ్దరత్నాకరము, శబ్దార్థచంద్రిక, నాఁటి నిఘంటువు లివాచస్పత్యమువలెఁ బర్యాయపదముల బాహుళ్యములుగా లేవు. కవులమాటల కయ్యవి కఱువుగానున్నవి. ఈ నిఘంటురాజ మవ్విధమునకుంటోక బోధనాపద్ధతివలె నున్నది. **** అత్యరాభ్యాసులకైన ప్రతివ్యక్తికి సులభముగ బోధపడునట్లు వాచస్పత్యముంట కడుసంతసము. ***' ఇత్యాదిగ సెలవిచ్చిరి.

10. జనమంచి సీయరామస్వామిగారు, ప్రధానాంధ్రపండితుడు, మ్యునిసిపల్ హైస్కూలు, అనకాపల్లి. వీరు

'మీనిఘంటుపద్ధతి నన్నత్యంత్యానంద మొసనిమున్నఁ గావించినది. ఈయుత్తమగ్రంథము నవాంధ్రగీర్వాణభాషా వైశారద్యమునకు నిదర్శనమై, పండితులకుఁ బరమమిత్రమై, విద్యార్థులకుఁ గామధేనువై, కవులకుఁ బెన్నిధానమై, పాఠశాలలకుఁ జింతామణియై, యాంధ్రమాతమునకు కంఠాభరణమై, గ్రంథాలయములకుఁ గల్పతరువై, నిఘంటువులకు శిరోరత్నమై విరాజిల్లునని నేను విశ్వసించుచున్నాను.' అని పొగడినారు.

11. వాదెల్ల మేధాదక్షిణామూర్తిశాస్త్రిగారు

'ఇది యఖిలాంధ్ర శబ్దపర్యాయ పదోద్ధారకమును, మహాకవిప్రయోగాధారప్రాచుర్యము నొంట రచయితలకుం బఠితలకుంగూడ మహోపకారకమును. లక్ష్మీనారాయణయశస్సారకమునై యాంధ్రభాషాయోషాహార హీరాయమానంబుగా ధాయీతలంబున నలరారనయ్యెడు**' అనునది వీరి యభిప్రాయము.

12. భారతీతీర్థప్రధాని బుఱ్ఱాశేషగిరిరావుగారు (యం. ఏ. విజయనగరము) ఇట్లు సెలవిచ్చినారు :

"*** శబ్దనిర్వచనములు చాలా జ్ఞానదాయకములుగా నున్నవి. ఇది కేవలము నిఘంటువుగానే కాక విజ్ఞానసర్వస్వమువలె నుపయోగపడఁగలదని చెప్పవచ్చును."

13. విజయనగరము శ్రీ మహారాజా కళాశాలా ('భూతపూర్వ') ఆంధ్రగీర్వాణభాషాధ్యాపకులు మేడేపల్లి వేంకటరమణాచార్యుల

గారి యభిప్రాయ మిట్లున్నది:

"** సంస్కృతి వాఙ్మయమునకు రచించిన "వాచస్పత్యము" అను మహానిఘంటువును బోలినది సకలాంధ్ర గీర్వాణ శబ్దజాలముతోఁ గూడినది యగు "వాచస్పత్యము"ను నొక పెద్దనిఘంటువును గూర్చి లోకమున బ్రకాశింపజేసిరి. ** ఇదివరకు వాడుకలో నాంధ్రనిఘంటువు లన్నిటికంటె విపులతరమయి వ్యాపకమై యున్నది. ఇటుపైని నిఘంట్వంతర నిర్మాణమున కవకాశముండదని నాయభిప్రాయము."

ఈయభిప్రాయ భాగములన్నియు నిఘంటు సంచికలయందు సంపూర్ణముగ ముద్రితములయినవి. ఇట్టి యభిప్రాయముల నీయబూనిన సాహసము నేమనవలెనో తెలియకున్నది. లేక, పండితాభిప్రాయములను నిట్లు లేయుండను కాబోలు!

ఈనిఘంటువును 'పత్రికలు' గూడ తెగపొగడినవి. సామాన్యముగ నేటి తెలుగుపత్రికల యభిప్రాయములు ప్రమాణబద్ధములు కావు. కాని కొన్నిటిమాత్రము కొంత ప్రామాణ్యము అని యంగీకరింపవలసి యుండును. ఇదియంతయు 'అంధపరంపరాన్యాయము' నకు దృష్టాంతము గానున్నది. అబ్బ!! ఆంధ్రలోక మిట్లు గ్రుడ్డియయ్యె నేమి?

ఈకాలమున తెలుగుదేశమున లెక్కకు మిక్కిలిగ చెదపురుగుల వలె బయలుదేరుచున్న పనికిమాలిన పుస్తకము లొకట నాంధ్రవాఙ్మయప్రాకృతమును చీడవలె దగుల్కొని తినివేయుచున్నవి. మఱియొకట స్వార్థపరులగు నెట్టి వ్యాకరణాది భాషాజ్ఞానశూన్యులనుగూడ మాసిన పేరులతో నమ్మజూపి యూగించుచున్నది. మఱి సంతతపిండలిల జాతీయరచనా విహంగములు దానిరెమ్మలను చివ్వఁచియుండ కొంతకాలమునకు జేయుచున్నవి. ఇప్పుడీ "యాంధ్రవాఙ్మయమహోదధియందు జన్మించిన యీ నిఘంటు బడబానలము దానిని చుట్టుముట్టుకొనినది. దీనితో నది సజీవమై యుండునను వాస యంతరించినది. అమంగళము దూరమగుగాక! ఆంధ్రహృదయము అన్యభాషాలాలసమయి తద్దాస్యమునకు పాలుపడి మాతృభాషాభిమానశూన్యమగుటయే యీ ముప్పునకు ప్రధానకారణము.

ఈనిఘంటువున కిప్పటికి పోషకులు, చందాదారులు మొదలగువారు మూడువందల కెక్కుడుగ చేరినారు. వీరయినను నిఘంటువు నిరుపయోగతను తెలిసికొనజాలరయిరి. ఇదియంతయు నింద్రజాలము వలె కనబడుచున్నది.

శబ్దరత్నాకర మిప్పటికందు నాంధ్రనిఘంటువులలో నుత్తమమయినది. అదియు నసమగ్రము, సంస్కారాపేక్షము. కావున నొక చక్కని నిఘంటు నావశ్యకము. ఆంధ్రసాహిత్యపరిషత్తు అపారధనవ్యయమున సహించి యిరువదియేండ్లనుండి యొక నిఘంటువును గూర్పించుచున్నది. రెండుమూడేండ్లక్రిందట వావిళ్లవారొక దానిని తయారుచేయించుచుంటిమని ప్రకటించినారు. ఇవి ప్రామాణికములుగా నుండవచ్చును కాని ఇవి యెంతవరకు సాగినవో; ఎన్నడు వెలుగున బడనున్నవో?

ఇంతలో నీ'పిచ్చి' నిఘంటువు తలపడి దేశమున వ్యాపించుచున్నది; దేశము ధనమును కొల్లగొట్టుచున్నది.

ఇట్టినిఘంటు తత్త్వమును ప్రకటించుటవలన 'నిఘంటుకర్తకు' కాకతాళీయముగ నపకృతి యగును గాని భాషకు, దేశమునకు నీనిఘంటువు వలనగలుగు నపకృతిముందది యొక లెక్కలోనిది కాదు. వారింతటి నయినతమయసామర్థ్యమును తెలిసికొని యీ నిఘంటు ప్రకటనమును మానుకొనుట తమకు, భాషకు, దేశమునకు సర్వథా శ్రేయము.

కృత్తివెంటివారి 'నెల పొడుపు'

హనుమదింద్రకంటి

ఇది యొక చిరుకావ్యముల ప్రోగు.

రచయిత 'కృత్తివెంటికులసాగర'చంద్రుడు.

అసలే 'అరకొటి శతావధాని' అపైన 'కవిభూషణుడు' కించ కళాచార్యుడు (M. A.) అగు 'సుబ్బారాట్కవి.'

ఇక వీరి రచన స్పృహణీయము కాకపోతుందా? అని ఈసమీక్ష.

"భావకవిత్వమను నొకయల్లరి పాఠకుల నగ్గోలుపఱచు నిక్కాలమున" పాడిచిన ఈనెలను అందులో కిద్యపద్దని కవి చేపాడు.

కాని—దీనికి "భావ-పేరు" పెట్టి పేరులోనే పొరపెట్టారు. 'నెలవంక' అని ఒకభావకావ్యం ఉన్న సంగతి ఎరుగరేమో. అయితే: 'కవిచంద్రుని వాటిని గాంచినారు' కనక ఈచాపల్యం తప్పుదు కాబోలు.

'వ్యర్థకుచశల్యపరీక్షలకు దిగక రసగ్రహణశాలురుగనే' ఈకావ్యమును చదువవలె నని రచయిత 'ఫర్మానా'

మహాప్రసాదం—

కావ్యంలో రసస్ఫూర్తి ఉంటే పఠిత తప్పులను త్రొక్కుగుంటూ పోయి ఎలాగూ, ఆనందిస్తాడు. "కావ్యం...పరనిర్వృతయే" కనక.

కావ్యానికి ప్రాణం అయిన రమణీయార్థం చిక్కకపోతే విమర్శకుడు డాక్టరువలె ఆకావ్యశవాన్ని కోసికోసి ఏపరీక్ష అయినా చేస్తాడు. అప్పుడు అజ్ఞానం అంతా అన్నీ 'దర్యాజాల' దగ్గర మాట్లాడవలసిందే.

"నిజముగ కావ్యమందు 'గల నిగ్గు" తీసి గిరిప్రభువులాగ ఖండాంతరాల్లో ప్రజ్వరిల్లచెయ్యలేకపోయినా "కావ్యరత్నముల

గాంచి యమునాయ వహించ"కుండా ఈ 'నెలపొడుపు'లో ఏమున్నదో సమీక్షాదృష్టితో చూస్తాను.

కవిత్వం:—ఈయన రచనలో మృదువైన స్వభావోక్తి ఉన్నది. దానికి తగిన పదాల పొందిక ఉంది. ఉదాహృతి: "ఉరుమురుమ త్రాచుపిల్లపై కురక లెత్తె"

కాని కోమటిపద్దులాగ ఒకప్పుడది జాబితా అవుతుంది. "పనిగలిగె పుష్కలమ్ముగ బ్రాహ్మణులకు, వేళ తీరిక లేదు దర్జీలకు, ఒని చేరవగి పాలి కిప్పుడు చేతినిండ" (దసరాపండుగ)

"స్వభావోక్తి రసౌ చారు యథావద్వస్తువర్ణనం" అన్నారు పెద్దలు.

కవిత్వానికి భావనాశక్తి నికషం.

అయితే ఇందులో చాలావరకు భావాడంబరం ఉంది కాని భావశుద్ధి లేదు.

'పూలగంప' తలబెట్టుకుని 'పూలబ్బి' అవూ లట్లాంటివి, ఈవూ లట్లాంటివి అని చలాకీగా పోవడం బాగుంది—కాని—

ఉబ్బితబ్బిబ్బులై యూహార్ణవతరంగ
కల్లోలతకు చాల యల్లలాడి,

కవి 'పూలబ్బి' చాటున ఉపన్యాసాలు అసందర్భంగా చేల కట్టడం భావశుద్ధికి భంగకరం. అయితే పింగళివారి గంపలో కట్టేసి మారుబేరం సాగించితే దివాలా తగిలింది పాపం!—పైగా.

'సొంత మడిపంట' ట
'ఎరువు కొసంత లేదు' ట గోరం, గోరం,
సొంతమడిపంట ఇంకొంచెం చూడండి.

"కీర్తికాంతారతికి మరుకేళి ముక్తి
కామినిసంగమున తార్పుకత్తె"

ఇది 'శ్రవణానందం' లోని గురుద్రవ్యం కాదంటారా? బలిజేపల్లివారి చీకటిపిసాళి

"ఏనాటి మాటలో ఏతేర కవిరాజా
లెదురేగి సత్కార మిచ్చు టనిన"

'పుష్పమాల'

ఇది సత్యనారాయణగారి ఆంధ్రపౌరుషంనుంచి దత్తత.

ఏనాటి మాటలో భూనాథవంశదీ
పాయితుం డైనకృష్ణావనీంద్రు (డు)

ఆంధ్రపౌరుషం

'వెన్నెల' అనే కావ్యంలో గూడ భావశుద్ధి లేదు. వర్ణనీయమైన వెన్నెల ఉపసర్జనమై భావాడంబరం విస్తరిల్లింది. వ్యంగ్యంగానైనా వెన్నెల సమ్యక్స్ఫూర్తి లేదు. మనోహరమైన వెన్నెలమీద కూడా 'అరఘటికతావధానం' అడుగుపెట్టింది. ఇందలి చాలాకావ్యాల భావన ఊరక సాగిపోయి విసుగుపుట్టిస్తుంది. మరిన్ని ఇందులో పాతకవిత్వపు చాదస్తాలూ, కొత్తకవిత్వపు పేచీలూ సమృద్ధిగా ఉన్నాయి.

మొత్తంమీద కవిభూషణుని కవిత్వానికి నూటికి ౫౦ మార్కులకన్న రావు.

శైలి:— ఈ కావ్యంలో ఒక నిర్ణీతమైన శైలి లేదు. కవిత్వం పరిణతికి వస్తే కాని శైలి ఒక దారిలో నిలబడదు,

ఒకచోట మృదువైన చక్కని శైలి—

"చిరుమబ్బుల ముసుంగు తెరల మాటుననుండి
ఇంద్రాణితో నవ్వు నేమొ యనగ"

ఒకచోట 'పులగం' శైలి—

'కేవలఖేలన కేరింత గాదు'

'మనసార నొవరప్ప యతిష్యమాణయై'

ఒకరొంపె రొంగుడు దిగుడు శైలి—

"ఘుస్మరిత మూడు డెంతో ము ఖ్యావిషయు మిది"

'దిధిషుడా! లేగు నీకెందు'

అన్వయం:—చూడండి.

'సంస్కారణాదృష్టి విషబుద్ధి పాంథులకు మ్మ'

అన్వయం లేని యతిప్రముఖులు నెగడుగారు, నెరిగారు, మతిగారూ, నూటిగారూ ఎడనెడ దర్శనం ఇస్తారు.

అనుప్రాస కక్కుర్తికి అన్వయం చాలామట్టుకు చెడగొట్టుకున్నారు. ఉదాహరణం 'పూలగంప'

చ్యుతసంస్కృతులు:—కావ్యమును వికృతపరుస్తాయి. "దోషాస్తస్యాపకర్షకాః"

'వంట చల్లేరు చూ' పల్లేరుతో కూడి చెడింది.

'దుర్వ్యత్రమం బొదలి' 'వదలి' కి వచ్చిన తిప్పలు.

'ప్రతిపట్టు' 'ప్రతిపదమ్ము' అనరాదూ?

'వదిష్యమాణయై' పరస్మైపదములకు 'శానచ్' రావడం అశాస్త్రీయం.

ఇది స్థాలీపులాక న్యాయముగా నడపిన సమీక్ష. నేను చూపిన గుణదోషాలకు ఇంకా చాలా లక్ష్యము లున్నవి.

ఈ 'కవిచంద్రుడికి' ఈపైని పౌర్ణమి రావచ్చునేమో! కాని ఇప్పటి కిది నెలపొడుపే.

" పరభణితి పరీక్షా యుజ్యతే సజ్జనానాం "

మల్లినాథుండు

అది వొక విచిత్రమైన సన్నివేశం.

దేశానికి,

జయంతి రామయ్యపంతులుగారు ఆంధ్రసాహిత్యపరిషత్తును ప్రసాదించారు. ఆంధ్రసాహిత్యపరిషత్తు జయంతి రామయ్యపంతులుగారిని చెయ్యెత్తి చూపించింది.

* * * * * *

కాన్తే అవి వాఙ్మయవినోదాలేమీ లేనిరోజులు కావు.

పండితులూ, కవులూ, పండితరాజులూ, కవిరాజులూ మామూలు భాషాభిమానులూ, వాఙ్మయప్రియులూ — ఇలాంటివారెందరో, ఎంతెంతలేసివారో యేవేవో గ్రంథాలు, రాస్తూ, ఏమిటేమిటో సంస్థలు నెలకొల్పుతూ, ఏమిటేమిటో ప్రచారం సాగిస్తూనే వుండినారు.



కాని మనకు సాహిత్యపరిషత్తు లేనిలోపం వొక్క రామయ్యపంతులుగారికే కనపడింది. అది వారొక్కరి హృదయాన్నే గుబగుబలాడించింది. చివరికి వారిమొదటిలోనుంచే అది మొలుచుకు వచ్చింది.

అయితే: నిజంచేత, రామయ్యపంతులుగారు సాహిత్యపరిషత్తును ప్రతిష్ఠించడం ఆశ్చర్యకరమైన సంగతి. ఏమంటే! వారు చదివింది లా. చేస్తూవుండింది డిప్యూటీ కలెక్టరీ. పోనీ, ఇలాగ, రెవెన్యూ క్రిమినల్ వ్యవహారాల్లో మునిగితేలుతూ వుండినా వంగదేశంలో బంకిం చంద్రుడు లాగ పంతులుగారు వాఙ్మయనిర్మాణంలో కూడా సిద్ధహస్తులేమో అంటే అలాంటిది యేమీ వుండినట్టు లేదు. వారప్పటికి కేవలం శనైశ్చరశతకం రాశారేమో! చేతికింద వుండిన మున్సబుకరణాల పరిమిత బుద్ధిని వినియోగించుకుంటూ శాసనాలు సంపాదించి పరిశీలిస్తూ వుండినారేమో. ఇంతేకాని అప్పటికి పంతులుగారిలో సాహిత్యపరిషత్తు నిర్మించడానికి తగినంత సత్తా యేకోశంలోనూ లేదు.

డిప్యూటీకలెక్టరుగా వుండిన పెద్దమనిషికి వొక సంస్థను ప్రతిష్ఠించడమూ, దానికి కార్యక్రమం యేర్పరచడమూ, దాన్ని ఆచరణలో పెట్టడమూ అసాధ్యాలు కాకపోవచ్చు; కాని యిది కేవలం ప్రతిభవల్ల సాగేది కాదు. చిరకాలం సంపాదించిన అనుభవం అంతా వినియోగిస్తే గట్టెక్కడాని కిది లౌక్యవ్యవహారం కాదు.

ఏమయితే యేం! ఒక డిప్యూటీకలెక్టరువల్ల ఇది ప్రతిష్ఠించబడింది. ఒక మామూలు భాషాపరిచితునివల్ల నడపబడుతోంది.

ఈ రెండుశక్తుల ఛాయలూ అప్పటికీ యిప్పటికీ యీపరిషత్తులో స్ఫుటంగా కనపడుతూ వున్నాయి.

* * *

రామయ్యపంతులుగారు మొదట మిడిల్‌స్కూల్లోనూ, తరవాత హైస్కూల్లోనూ వుపాధ్యాయులు. విశాఖ జిల్లా మాజిస్ట్రేటుకచేరీలో సాధారణ గుమస్తా—ఇంగ్లీషు హెడ్‌క్లార్కు—శిరస్తాదారు—డిప్యూటీకలెక్టరు—కొన్నాళ్లు ప్రెసిడెన్సీ మాజిస్ట్రేటు—మళ్లీ డిప్యూటీకలెక్టరు, తుదకి పెన్షనరు. తరవాత వొకటరం ఎం. ఎల్. ఏ.

మొత్తంమీద—ఇలాగ—పంతులుగారి జీవితం అంతా శుష్కరాజకీయాల్లో పండబారిపోయింది; కాని అరవై దాటిన యీవృద్ధాప్యంలో అనురక్తిం ప్రసాదించే వాఙ్మయోద్యానవనంలో అది కులాసాగా పికార్లు కొడుతూవుంది.

అయితే: ఇందులో వొక తేడా మాత్రం వుంది అదేమిటంటే! రామయ్యపంతులుగారు విహరిస్తూ వున్నది నిజంగా వాఙ్మయోద్యానవనమే; కాని అందులో తారుణ్యం లేదు. లావణ్యం లేదు. సౌరభం లేదు. జీవకళే లేదు. అయితే: చైతన్యం మాత్రం యేపినరంతో యేమూలో వుంది. అంతే.

* * *

కనిపెట్టగలిగితే రామయ్యపంతులుగారి జీవితంలో వొక గొప్ప త్యాగం మిలమిల మెరిసిపోతూ వుంది.

బాగా ప్రాజ్ఞత వచ్చాక రామయ్యపంతులుగారు పడసిన పదవులు అనేకుల జీవితాలను బగ్గంపాలు చెయ్యడాని కేనా, తేజస్వంతాలు చెయ్యడాని కేనా సమర్థమయినవి కాని సామాన్యాలు కావు. అందేత ఆత్మద్రోహానికి వెనకతియ్యకపోతే వాటిలో ఎంతేనా— ఎందు కేనా అవకాశా లున్నాయి; కాని రామయ్యపంతులుగా రెవ్వుడూ శీలాన్ని కళంకితం చేసుకున్నట్టు లేదు. విధినిర్వహణసందర్భాల్లో, వారు, తాబేదార్ల మీద ఎప్పు డేనా మండిపడేవుండవచ్చు. అక్రమలాభాలు పొందతలచినవారి కనేకమందికి ఆశాభంగం కలిగించేవుండవచ్చు; కాని సమర్థుడై న వుద్యోగిగా—సన్మార్గనిష్ఠితుడైన రాజపురుషుడుగా పంతులుగారు గొప్ప విజయం పొందారు.

పంతులుగారి జీవితంలో యింకో మంచి విశేషం వుంది. వాస్తవంగా అదే పంతులుగారికి ఈవాఙ్మయసేవలో గొప్ప అవకాశంగా పరిణమించింది.

ఏమిటంటే ? రామయ్యపంతులుగారికి సర్కారుద్యోగస్థులుగా వుండినప్పుడు అనేకమంది సంపన్నులతోనూ, జమీందార్లతోనూ పని—పరిచయం—స్నేహం—వారిమీద తిరుగులేని పలుకుబడి ఏర్పడ్డాయి. అప్పుడు గాని తరవాత గాని పంతులుగారు వీటిని సొంతానికి వినియోగించుకుని వుంటే వారు కొన్ని లక్షలకి అధీశ్వరులై వుండివుందురు.

కాని పంతులుగారిలో పరిణతి చాలకపోయింది; కాని పరార్థపరత్వం తక్కువగా లేదు.

యుక్తసమయంలో ఆస్నేహమూ, ఆపలుకుబడీ—అంతా సాహిత్యపరిషత్తుకి మూలధనంగా రూపొందింది. ఆంధ్రదేశానికీ ఆంధ్రజాతికీ జైత్రప్రస్థానంలో తిరుగులేని అంగబలంగా పరిణమించింది.

* * *

నిజమే. ఇప్పట్లో పరిషత్తు, అలాంటి యితరసంస్థల కంటె చాలా ధనవంతమే.

కాని యేం లాభం ?

నవనవలాడుతూ బయలుదేరిన ఆంధ్రసాహిత్యపరిషత్తు వెర్రితలలు వేసింది.

ఏం ?............ఎందేతా ?

అతికష్టసాధ్య మైన కార్యాన్ని ఆడుతూ పాడుతూ సాధించిన రామయ్యపంతులుగారే దానికి ప్రవర్తకులై వుండినప్పు డిలాంటి గతి యెందుకు పట్టాలి ?

పెద్ద పరిశోధన చేస్తే గాని తేలని విషయం కానిది. రామయ్యపంతులుగారిదగ్గిర నిర్మించడానికే గాని నిర్వహించడానికి తగిన శక్తి యెంతమాత్రమూ లేదు.

ఉద్దేశం కలిగింది, పలుకుబడి వుంది, వ్యవధానం కూడా మంచిది, సరే, ఆంధ్రసాహిత్యపరిషత్తు యేర్పడింది. అంతే; కాని "ఇప్పుడు మన సాహిత్యం యేస్థితిలో వుంది ? ఇకముం దెలా వుండాలి ? ఇరుగుపొరుగు సాహిత్యా లెలా వున్నాయి ? వాటికీ, మనసాహిత్యానికీ భేదం యేమిటి ? దేనిలో జీవం వుంది ? ప్రపంచవ్యాప్తాలై నవీనసభ్యతకు నికషాలైన పాశ్చాత్యసాహిత్యా లెలా వున్నాయి ? మన సాహిత్యానికీ వాటికీ వార యేమిటి ? అది యేమాత్రం ? అజ్ఞానాంధకారంలో కూలిపోయివున్న ఆంధ్రజాతిని మేలుకొల్పడానికీ, కార్యోత్సాహం కలిగించడానికీ, సాహిత్యం యెంతవరకూ వుపకరిస్తుంది ?" అని యిలాగ పంతులుగారు చర్చించుకున్నట్టు కనపడదు. చర్చించుకునివుంటే వారు చెయ్యవలసిన దానిలో నాలుగోవంతేనా చెయ్యగలిగివుందురు. నడవకపోయినా అసలు సరియైన కార్యక్రమ మేనా ఏర్పరుచుకునివుందురు; కాని అవేమీ లేవు. పంతులుగారికి సాహిత్యం అంటేనే అసలు సరియైన భావం వున్నట్టు లేదు. పత్రికలో పూర్వకవుల ప్రబంధాలు ముక్కముక్కలుగా ప్రకటించడమూ, వార్షికసమావేశాలలో వాటిమీదా, వ్యాకరణపు కట్టుబాట్లమీదా వుపన్యాసాలిప్పించడమూ, వ్యాసాలు చదివించడమూ—ఇలాంటిది చూస్తే సాహిత్యం అంటే యింతమాత్రమే అని వారి నిర్వచనంగా కనపడుతోంది.

కనకనే సాహిత్యపరిషత్తులో ...

కో—పండితులకో తప్ప జాతి మొత్తంమీద యేమీ సంబంధం లేదు. సూర్యరాయాంధ్రనిఘంటువు శబ్దయా పాలకోసమే తనుకులాడుతూ కరడుకట్టలేకపోతోంది. పత్రిక ప్రబంధాల ముక్కలు వేసుకుని సామానుబండి లాగ తిరుగుతోంది.

* * *

కనకనే అరవై యేళ్లు దాటాక రామయ్యపంతులుగా రిప్పుడు అమరుకం తెనుగుచేసీ, ఉత్తరరామచరిత్ర తెనుగుచేసీ—ఇలాగ కవిత్వంలో ప్రవేశించారు. గ్రంథరచన—నాటకాలూ శృంగారగ్రంథాలూ భాషాంతరీకరణ మయినా చేస్తేగాని సాహిత్యపరిషత్తులో తమకి న్యాయమైన పదవి వుండ దనీ, యోగ్యత చూపించి స్థానం సంపాదించడమే పౌరుష మని తోచింది కాబోలు వారికి.

* * *

ఆరంభంలో అభినవవాగనుశాసనులైన రావుసాహేబు గిడుగు రామమూర్తిపంతులుగారి దాడి పరిషత్తును కొయ్య్‌కొయ్య్ మనిపించివుండడం నిజమే; కాని కొద్ది రోజుల్లోనే రామమూర్తిపంతులుగారు పరిషత్తువల్ల తమకేమీ లాభం లేదనీ, దాన్ని పట్టుకుపాకులాడకపోతే తమకి వచ్చే ఆపత్తు లేదనీ గ్రహించి దానిని తోసిరాజని నవశక్తిసంపన్నులయిన కవికుమారులను కూడగట్టుకుని కార్యసాఫల్యం పొందారు. ఇలాగ యీగండం తప్పాకేనా పరిషత్తు తాను నమ్మిన గ్రాంథికాంధ్రలోనే నిరాటంకంగా నవ్యసాహిత్యనిర్మాణం చేస్తుం దని ఆవర్గం వారు కొందరు ఆశపడ్డారు; కాని యేమీ లేదు. ఇవాళ చూస్తే గ్రాంథికవాదుల్లో కూడా అనేకమందికి పరిషత్తుమీద ఏమీ ఆశలు లేవు.

కర్ణాటకసాహిత్యపరిషత్తు, కన్నడభాషను కమ్మేస్తూ వున్న హిందీని ఎదిరించి బ్రహ్మాండమైన పని చేస్తోంది. మైసూరుప్రభుత్వంవారు తమ రాజ్యంలో వున్న ఆంధ్రులను కన్నడులుగా మార్చడంకోసం అవలంబించిన కార్యక్రమంలో పూర్తిగా పాలుపుచ్చుకుని రాత్రింబగళ్ళు ఒళ్లుమరిచి పనిచేస్తోంది. సాటిపరిషత్తులు చేస్తూవున్న పని చూసేనా—తన భాషకు జరుగుతూ వున్న అప కారాన్ని అడ్డుకోడాని కేనా ఆంధ్రసాహిత్యపరిషత్తుకు శ్రద్ధే కాదు, వుద్దేశమూ, ఆజ్ఞానమూ కూడా లేవు.

* * *

ఏతావతా: యాభై సంవత్సరాల వయస్సు వచ్చాకైనా సువర్ణాక్షరాలతో అంకితం అయిన—ఎంతో రాయవలసినంత జటిలంగా అల్లుకువచ్చిన రామయ్యపంతులుగారి జీవితచరిత్ర యిలాగ "యేమంత పొడిచేసింది లేదు" అన్నంత బులబులాగ్గా తేలిపోవడం ఆశ్చర్యకరమే; కాని అనుకంపాజనకంమాత్రం కాదు.

* * *

మొత్తంమీద, రామయ్యపంతులుగారు ఇప్పుడే నా సజీవ మయిన వ్యావహారికాంధ్రభాషను చేపట్టి త[illegible] లేఖినికి నూత్నచైతన్యమూ, తమ జీవితానికి నూత[illegible] కళా కలిగించుకుంటూ రవి యెవరికీ యెంతమాత్రమూ నమ్మకమూ, ఆశా లేవు. దాన్ని స్వీకరించి ఉపయో[illegible]గించుకుంటే కాని నిరుపయోగమూ, నిష్ప్రయోజనమూ అయిపోతుం దని బెంగటిల్లడానికి వారిలో భావనా[illegible] కూడా యేమీ లేదు.

* * *

కాని—యేది యేమయిపోయినా వొక్కటి మా[illegible] నేను నిక్కచ్చిగా చెప్పగలను.

అదేమిటంటే?

రామయ్యపంతులుగారి వంశవర్ధనుడు మాత్రం [illegible]కుండా వ్యావహారికాంధ్రభాషాప్రియు డవుతాడు. [illegible]హారికభాషావాది అవుతాడు. వ్యావహారికభాషా[illegible]యిత కూడా అవుతాడు.

ఇంతే కాదు. ఇలాంటివారి అందరి కుటుంబాలలో [illegible] ఇది యిలాగే తటస్థిస్తుంది.

ఇప్పటికే కొన్నిచోట్ల తటస్థించికూడా వుంటుం[illegible]

గాలిలో చూచాయగా యేవో కబుర్లు విని[illegible]తున్నాయి. అవి యీవిషయానికి సంబంధించినవే [illegible] వుంటాయి.

—శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

గద్వాల చినసోమభూపాలుడు

మారేమండ రామారావుగారు ఎం. ఏ. బి. ఇడి

(గద్వాలసంస్థానం తెనుగుదేశానికీ, తెనుగుజాతికీ గొప్ప ఆభరణం. గద్వాల ప్రభువులు కేవల శూరులూ, వీరులూ, మహారాజులే గాక పండితులూ, కవులూ కూడా అయి వాఙ్మయానికి మంచి పుష్టి కలిగించారు. ఇప్పటికి కూడా గద్వాలసంస్థానంలో పండితులకూ, కవులకూ గొప్పగొప్ప సన్మానాలు జరుగుతూ వున్నాయి. ఇప్పుడు రాజ్యభారం వహించివున్న శ్రీ శ్రీ శ్రీ ఆది లక్ష్మీదేవమ్మగారు పూర్వుల ప్రతిష్ఠకు ఏమీ వెలితిరాకుండా రాజ్యం ఏలుతూ దేశానికంతకూ ప్రాతస్స్మరణీయరాలయివున్నారు. గద్వాలసంస్థానం పూర్వచరిత్ర అంతా క్షుణ్ణంగా పరిశీలించివున్న శ్రీ మారేమండ రామారావుపంతులు ఎం. ఏ. బి. ఇడిగారు గద్వాల ప్రభువుల దివ్యచరిత్రాలతో ప్రబుద్ధాంధ్రకు శోభ కలిగించడానికి పూనుకొని వున్నారు.

మరిన్ని హైదరాబాదులో హైకోర్టువకీలుగా వున్న శ్రీ నురవరం ప్రతాపరెడ్డి బి. ఏ. బి. ఎల్ గారు గద్వాల ప్రభువుల రూపపటాలు దయచేసి ప్రబుద్ధాంధ్రకు కళ కూర్చారు. రెడ్డిగారికి గద్వాలసంస్థానం అనేటప్పటికి గర్వం గరిపోడుస్తూ వుంటుంది.

ఇలాగ తేజస్వంతమైన గద్వాల ప్రభువుల చరిత్రతోటీ, దివ్యరూపాలతోటీ ప్రబుద్ధాంధ్రకు ప్రకాశం కలిగించబూనుకునివున్న ఈ మిత్రుల కిద్దరకూ హృదయపూర్వకమైన మా కృతజ్ఞతను విన్నవించుకుంటూ శ్రీ శ్రీ శ్రీ ఆదిలక్ష్మీదేవమ్మ మహారాణీగారికీ, వారి కుటుంబానికీ—ముఖ్యంగా యువరాజాబహద్దరువారికీ అభ్యుదయం కలగాలని కోరుతున్నాము.

సంపాదకుడు)

క్రీ. శ. ౧౭౬౧—౧౭౯౪

గద్వాలరాజ్యమును, దుర్గమును స్థాపించి మహావీరుడని వినుతికెక్కిన రాజా పెదసోమభూపాలునకు చినసోమభూపాలుడు పౌత్రుడు. గద్వాల రాజులలో నతనికి బిమ్మట నితడే మిక్కిలి ముఖ్యుడైనవాడు. ఈ రాజా క్రీ. శ. ౧౭౬౧ విషుసంవత్సర శ్రావణ శు ౧౦ నాడు గద్వాలరాజ్యమున కభిషిక్తుడయ్యెను.

చినసోమభూపతి మహావీరుడును రాజ్యతంత్రజ్ఞుడునై యుండెను. యువరాజుగ నుండియే యితడు క్రీ. శ. ౧౭౪౩ లో నైజామునకు యుద్ధరంగమున నమూల్యమగు సహాయము నొసర్చి, యతనిచే ౨౦౦౦ రూప్యములను బహుమతిగ బడసెను. ఇతని సాహసములను మెచ్చి కర్నూలునవాబు వీరనికి కర్నూలుపై సర్దేశగౌడకి యధికారము నొసంగెను. రాజ్యమునకు వచ్చిన వెంటనే నైజాం సలాబత్ జంగు సోమభూపాలునకు కర్నూలుసీమలో ౫ మహాలుల పైనను, ఆదోనిసీమలో ౫ మహాలులపైనను, నంద్యాల సీమలో ౧౫ మహాలులపైనను, నాడగౌడు సర్దేశగౌడు సర్దేశగౌడధికారములను, ఛత్రచామరాది రాజచిహ్నములను, నజరానాను గైకొను హక్కులను ఒసంగెను. పిమ్మట నీరాజా గద్వాలరాజ్యము ననేకవిధముల విస్తరింపజేసెను. క్రీ. ౧౭౬౫ లో నిత డమరచింతసంస్థానము లోని కొన్ని గ్రామములను యుద్ధసమయములో విశేషముగు సహాయమును జేయు పద్ధతిని నైజాం వద్దనుండి గుత్తకు దీసికొనెను. అటుపై నితడు ప్రక్కనుండు రాయచోటి సీమను గూడ నాక్రమించెను. క్రీ. శ. ౧౭౭౩ లో నైజామునకును పోరాపురరాజునకును జరిగిన యుద్ధములో నిచినసోమభూపాలుడు నైజాం సేనాని యగు అమీర్ ఉల్. ఉమ్రాకు చాల తోడ్పడెను. ఇందులకు సంతసించి నైజా మీరాజా ననేకవిధముల నభినందించి, రాయచూరు, బళ్ళారి మున్నగు సుబాల యధికారులను వారందరును సోమభూపాలుని యాజ్ఞలకు లోబడియుండవలెననియు, నతడు వారితో నొసర్చు సర్వవ్యవహారములకును దాను బద్ధుడుగ నుందు ననియు ఫర్మానాలను బంపించెను. ఇట్లు సోమభూపాలుడు నైజాముయొక్క యాదరవిశ్వాసములను బాత్రుడై, సామంతులలో నెల్ల నగ్రగణ్యుడై నిరుపమమగు విఖ్యాతితో నలరారుచుండెను.

క్రీ. శ. ౧౭౬౬ లో నైజామునకును, మహారాష్ట్రులకును యాదగిరివద్ద జరిగిన సంధి ననుసరించి మహారాష్ట్రులు దక్కనుపై చౌత్ను వసూలుచేయసాగిరి. ఆ విధమున ద్వంద్వప్రభుత్వ మేర్పడెను. అయినను సోమభూపాలుడు నైజామును మరాటీవారిని పణములుగ నుపయోగించి స్వార్థమునభివృద్ధి పరచుకొనుచుండెను. అంతట సోమభూపాలుని కీర్తివైభవములను గాంచి యసూయజెంది కర్నూలునవాబు గద్వాలరాజులకు దన సీమలపై గల నాడగౌడరికపు హక్కులను రద్దుచేసి క్రీ. శ. ౧౭౭౫ లో ఎంబాయి, రంగాపురము, సిరిసెళ్ళ మున్నగు నేడుగ్రామముల నాక్రమించెను. అప్పటినుండియు గద్వాలవారికిని నవాబునకును యుద్ధములు జరిగినవి. ఈకాలమున సోమభూపాలుడు వ్యాధిగ్రస్తుడుగ నుంటచే యుద్ధఫలితము గద్వాలవారి కనుకూలముగ నుండలేదు. ఈ రాజా క్రీ. శ. ౧౭౯౪ లో మరణించెను.

ఇంతవరకును చినసోమభూపాలుని నాటి రాజకీయ చరిత్రమును సంగ్రహముగ దెలిపి యుంటిమి. ఆకాలమునం దాంధ్రవాఙ్మయము గూడ పెక్కువిధముల నభివృద్ధి నందెను. సమకాలికు లీ రాజు “నభినవభోజు” డని గొనియాడుచుండిరి. స్వయముగ విద్వాంసుడై “రతిరహస్య” మను సద్గ్రంథమును రచించుటయే గాక నీత డెందరో కవుల నాదరించెను. ఈతని యాస్థానమునం దెన్నండును గురు సుప్రసిద్ధకవు లుండిరి. వారిని గూర్చి యీ క్రింది విశేషములు దెలియుచున్నవి —

(౧) కాణాదము పెద్దసోమయాజికవి—ఆత్రేయసగోత్రుడు వాశ్వలాయనసూత్రుడు నగు నీకవి “సకలవిద్వత్కవిమిత్రుడు” వేదశాస్త్రపురాణములను, బాహటమను వైద్యగ్రంథమును చక్కగ నెరింగి యారుచిత్రబంధగర్భము లను చతుర్విధకవితలను జెప్ప నేర్చినవాడు. భోజుని చంపూరామాయణమున కీకవి వ్యాఖ్యానమును రచించెను. ముకుందపురరాజగు బహిరీపామన్నపాలుని యాస్థానమునందుండి యాంధ్రమున మత్స్యపురాణమును రచించెను. గద్వాలకేతెంచి చినసోమభూపాలునిచే నాదరింపబడి భద్రాపరిణయ మను ముకుందవిలాసమును, అధ్యాత్మరామాయణమును, యథాశ్లోకతాత్పర్యరామాయణమునందలి బాలకాండము నాంధ్రమున రచించెను. (౨) కిరీటి వెంకటాచార్యుడు—ఈ శ్రీవైష్ణవకవి శఠమర్షణగోత్రజుడు, ఆపస్తంబసూత్రుడు. ఈతనికి “సర్వతంత్రస్వతంత్ర, కవితార్కికకంఠీరవ, శ్లేషయమకచక్రవర్తి” యున్నగు బిరుదము లుండెడివి. అలంకారకౌస్తుభము, జంఝూమారుతము, హయగ్రీవదండకము, శృంగారలహరి, భావశతకము మున్నగు సంస్కృతకృతు లీతని పాండిత్యమును చాటుచున్నవి. “కల్యాణపురంజన మను నాటకమును రచించి యీతడు గద్వాలకేశవస్వామి కంకితముజేసెను. “అచలాత్మజాపరిణయ” మను నీతని యాంధ్రద్వ్యర్థికావ్యము సుప్రసిద్ధము (౩) కొత్తపల్లి రామాచార్యులు—శ్రీవైష్ణవకవి. యథాశ్లోకతాత్పర్యరామాయణమునందలి యయోధ్యాకాండమును రచించెను. (౪) గార్గేయపుర సుబ్బశాస్త్రి—ఈ కవి “ఉభయకవితానిస్సహాయసాహితీధురీణుడు” యథాశ్లోకతాత్పర్యరామాయణారణ్యకాండమును రచించెను. (౫) కామసముద్రం అప్పలాచార్యుడు—ఈతడు “విద్వత్కవికుంజర” బిరుదాంచితుడు. చక్రకంకణపద్మశంఖధనుర్గజహయరథాదిబంధములను, సంస్కృతప్రాకృతభాషలలో పెక్కు గ్రంథములను రచించెను. యథాశ్లోకతాత్పర్యరామాయణ కిష్కింధాకాండ మీతనిచే రచింపబడెను. (౬) తిరుమల కృష్ణమాచార్యుడు—ఇత “షట్భాషాకవితాధురంధరుడు.” యథాశ్లోకతాత్పర్యరామాయణ సుందరకాండమును రచించినవాడు. (౭) బోరవెల్లి శేషకవి—రామాయణ యుద్ధకాండమును రచించెను. (౮) సోమనాథశాస్త్రికవి—ఇతనిని గూర్చి విశేషము లేమియు దెలియవు. వీరే గాక నీకాలమున నింక నెందరో సుప్రసిద్ధకవులు గద్వాలలో నివసించుచుండిరి.

చినసోమభూపాలుడు ధర్మనిరతుడును, గొప్ప భక్తుడునై యుండెను. కేశవస్వామికి అక్షరూపాయీల విలువగల జవాహిరీని సమర్పించి యీ రాజచంద్రుడు చక్కని దేవాలయము నొకదానిని గట్టించి, రామస్వామి నందు ప్రతిష్ఠించెను. కార్తికమాఘమాసములలో నతివైభవముగ విద్వత్సన్మానములను సాగించి యీతడు కవులను విశేషముగ నాదరించెను. అహోబలవైష్ణవమఠమున కీతడు శిష్యుడు. రామావధూతయను యోగి నాదరించి యతని కీ రాజు కృష్ణాతీరమున చక్కని మఠమును గట్టించి యిచ్చెను.

ఇట్లన్నివిధములను చినసోమభూపాలుని కాలమున గద్వాలరాజ్య మభివృద్ధి నందెను. ఇత డాంధ్రవాఙ్మయమున కొనర్చిన సేవ యమూల్యమైనది. ఇతని నామము చిరస్మరణీయము.

(ఈ చినసోమభూపాలుని రూపపటమే ముఖపత్రంమీద వున్నది. దీనిని శ్రీ సురవరం ప్రతాపరెడ్డిగారు మాకు దయచేశారు. ఇలాంటి పూర్వప్రభువుల రూపచిత్రాలింకా యెన్నో వున్నవి. తరువాటినే మేము ముఖపత్రంమీద ప్రకటిస్తాము. ఫొటోగ్రాఫీ లేకపోయినా వెనక చాలామంది చిత్రకారులు ఇలాగ అనేక మహాపురుషుల రూపాలు చిత్రించి వున్నారు. వాటిని అన్నిటినీ ఇలాగ ప్రకటించడం చాలా అవసరం. తెనుగువారికే సంబంధించినంత వరకూ ఇలాంటి రాజులవి గాని, సేనాపతులూ సంపన్నులూ పెద్ద అయినవారివి గాని రూపపటాలు ఉన్నవారు వాటిని మాకు పంపితే మేము ప్రకటించి అపూర్వపురుషుల దివ్యతేజస్సుతో నవీన ఆంధ్రజాతికి మెరుగు పెడతాము.

సంపాదకుడు)

వ్యాఖ్యానములు

ఆంధ్రజాతి కాదు, అంధజాతి

...గుళ్ళ మీదా వెనికిపోలేదు. పర్లాకిమిడిరాజాగారంత తోరాలో ...తా ఆంధ్రభూభాగం ఓఢ్రరాష్ట్రంలో కలిసిపోవడం నిశ్చయమయిపోయింది. ఇక యీ నిశ్చయంమీద పార్లమెంటు ముద్ర ...వాలి. అంతే తరవాయి.

వేలకొద్ది మైళ్ళ ప్రదేశమూ, లక్షలకొద్ది స్వజనమూ, పర...రాష్ట్రంలోకి లాగివెయ్యబడుతూ వుంటే యిక్కడ—ఆంధ్రదేశంలో చీమకుట్టినట్టేనా లేదు.

లక్షలకొద్దీ మనవారు బొంబాయిరాష్ట్రంలో స్థిరపడివున్నారు. మైసూరురాష్ట్రంలో పాతుకుపోయివున్నారు. ఇంకా అనేక పరరాష్ట్రాలలో రాష్ట్రీయులయిపోయివున్నారు. అవతల వట్టనడుమ కూడా కొంద రుండిపోయారు. గత్యాగత్యా మన కెప్పటి కేనా ప్రత్యేకరాష్ట్రం అంటూ వస్తే వారెలాగా మనలోకి రారు. అంటే జాతిపరంగానే గాని—రక్తసంబంధాన్ని పట్టే గాని వారికీ మనకీ రాజకీయంగా ఏమీ సంబంధం వుండదు. అదలా వుండగా యిప్పుడీ దెబ్బ గంజాం విశాఖపట్టణం జిల్లాలవారు—మన సోదరులు—ఈయిరవయ్యో శతాబ్దంలో మన చేతకానితనం కారణంగా బలవంతంగా పరరాష్ట్రంలోకి వెళ్ళిపోతున్నారు.

ఇదివరకే నిజాము రాజ్యంలో వుండిన ఆ జిల్లాల ఆంధ్రులతో మనకి సంబంధం వుందా లేదా అన్నట్టుగా సంచరిస్తున్నాం మనం. ఇప్పు డిదీ.

లండను వెళ్ళిన సగం రాయబారవర్గం అంతా అయిపోయిందని తీర్పు చేసింది; కాని యిక్కడ వులికిపాటేనా కలగలేదు.

అంటే దీనివల్ల నష్టం లేదా? ఆంధ్రజాతికి చైతన్యమే లేదా?

తెనుగువారికి—గంజాంవారికి కూడా యింకా కాంగ్రెస్సు మీదే చూపు. తమ యింటిని చక్కబెట్టుకోలేని ఆంధ్రులు కాంగ్రెస్సు ఏం వుద్ధరిస్తారో?

ఇదిలా వుండగా, కాంగ్రెస్సువల్ల మనకి యింకో చిక్కు కూడా కలుగుతోంది.

గంజాం భూభాగం ఓఢ్రరాష్ట్రంలో కలిపేసినా కొత్త (...గారు) శాసనసభలో ఆంధ్రమండలాలు ప్రత్యేకరాష్ట్రంగా ...వా అని తీర్మానం అయితే ఆవిషయం ఆలోచిస్తామన్నారు ... అధికారులు. ఉన్నంతమట్టుకేనా తెనుగుజిల్లాలు ఒకరాష్ట్రంగా ఏర్పడినా అదేనా ముక్తే. కాని తెనుగువారంతా కాంగ్రెస్సులో చేరాలిట. వచ్చే యెన్నికల్లో అందరూ కాంగ్రెస్సువారికి వోట్లివ్వాలిట.

ఎందుకో తెలుసునా? సత్యమూర్తిగారిని ప్రధానమంత్రిగా నెత్తి కెక్కించుకోడానికి. సుబ్బరాయన్ మంత్రాంగపు కాలంలో కంటే యింకా పెద్ద దెబ్బ తినడానికి.

సత్యమూర్తిగారు రాయలసీమకీ, చాళుక్యసీమకీ (సర్కారులకూ) యెప్పుడూ పొత్తు కలవకుండా వుండడానికి చేతనైనంత భేదోపాయమూ ప్రయోగిస్తున్నారు. ఉత్కళయువకుల పేరాసలకు పురియెక్కించి గంజాంభూభాగం ఆక్రమించడానికి ప్రోత్సాహం కలిగించారు. మంత్రి పదవులలో తెనుగువారికి స్థానం లేకుండా చెయ్యాలని దీక్షపట్టి వున్నారు.

కాని మనవారి కీసంగతి యేమీ బోధపడ్డం లేదు.

ధిక్! మనది ఆంధ్రజాతి కాదు, అంధజాతి.

జాగ్రత్త—అది తోకచుక్క

దక్షిణదేశంలో జరుగుతూ వున్న హిందీప్రచారోద్యమంలో, గాంధిగారు, కలేల్కరుగారికి ఎలాంటి బాధ్యత వప్పగించారో మాకు అక్షరాలా తెలవదు; కాని కలేల్కరుగారు మాత్రం యీవిషయంలో రాత్రింబగళ్ళు నిద్రాహారాలు మానికూడా పని చేస్తున్నారు.

ఇక్కడి జీతాలు పుచ్చుకుని తెనుగుజాతికి హిందీవిషం పోస్తూ వున్న హిందీప్రచారకులమీద హిందూస్థానీల కేమాత్రమో అనుమానం కలిగినట్టుంది. క్షణక్షణమూ వారిని పరిశీలిస్తూవుండడానికి కూడా నియోగించబడి కలేల్కరుగారు యెడతెరిపిలేకుండా పని చేస్తున్నట్టుంది.

ఏమయినా, కలేల్కరుగారిని మేము ప్రశంసిస్తున్నాము. ఎందుకంటే? దక్షిణ దేశభాషలను చంపెయ్యాలని వారి శపథం, ఆపైని గాంధిగారి ఆజ్ఞ. ఈశపథాన్ని ఈఆజ్ఞని నిర్వర్తించు కోడంలో కలేల్కరుగారు చూపిస్తూ వున్న శ్రద్ధా, దీక్షా ప్రశంసార్హ జనకాలుగా వున్నాయి.

అయితే: నిండుప్రాణంతో వున్న నాలుగు ప్రాంతీయభాషల ప్రాణాలు తియ్యడానికి కాకపోతే కలేల్కరుగారు మరో మంచి పనికోసం తంటాలుపడరాదూ?

నిజంగా, మన దక్షిణదేశీయులలో ఆత్మాభిమానమే వుంటే,—తమ మాతృభాషలమీద పూజ్యభావమే వుంటే వారికి "నువ్వా నేనా" అని యెదిరించవలసిన ప్రత్యర్థి కలేల్కరుగారు తప్ప మరొకరు లేరు.

కలేల్కరుగారి కొత్తసూచన వొకటి యిటీవల దక్షిణభారత హిందీప్రచారసభా కార్యదర్శివల్ల పత్రికల్లో ప్రకటించబడింది.

దక్షిణదేశభాషలకూ, గ్రంథాలకూ హిందీలో సంగ్రహ చరిత్రలు రాయించాలిట. దక్షిణభాషలలో వున్న వుత్తమ గ్రంథాలను హిందీలోకి అనువదించాలిట, దక్షిణదేశానికి సంబంధించిన అర్థశాస్త్రీక

సాంఘిక చారిత్రక రాజకీయవిషయాల చరిత్రలు హిందీలో వ్రాయించాలిట.

సంతోషమే. ఇది మంచి వుద్దేశమే. ఒక్క హిందీవాఙ్మయమే కాదు. ఏ వాఙ్మయ మైనా సరే విజ్ఞానపూర్ణంగా వుండా లంటే ఇలాంటి పనులు చెయ్యవలసిందే.

అయితే: ఈసంగతులు మనకి తెలియపరచడం యెందుకూ?

దక్షిణదేశీయుల—ముఖ్యంగా ఆంధ్రుల తత్వం వారికి బాగా తెలుసు. హిందీలో మాట్లాడుకుంటూ నిత్యజీవితం గడుపుకోవడం గౌరవంగా—మహాప్రసాదంగా భావించుకునే ఆంధ్రులు తమ సంగతి కూడా యెచీమంతో హిందీలో వుందంటే—ఇక కిందా మీదా వుంటారా?

కాలేల్కరుగారు "హిందీవల్ల తెనుక్కి అపకారం జరుగుతోం దనే వాదానికి మనవారు చెవి ఒగ్గకుండా వుండడానికి వేసిన యుక్తిది.

కాలేల్కరుగారు ఇంతటితో వూరుకుని వుంటే బాగుండిపోయేది: కాని వారంకా ముఖపరాభవం చెయ్యడానికి ప్రయత్నిస్తున్నారు. వారి అసలు సూచన చూడండి.

"హిందీ సాహిత్యసమ్మేళనంవారు జరిపించే ప్రథమ, మధ్యమ, రాష్ట్రభాషా. ప్రచారపరీక్షలకు దరఖాస్తు చేయగోరే విద్యార్థులు హిందీకి అనుబంధంగా మరియొక దేశభాషను దేనినైనను నిర్ణయించుకోవచ్చును"ట

ఎందుకూ? మున్ముందు, కాలేల్కరుగారు, "మరియొక దేశభాషను దేనినైనను" అనడంలో యెంత నేర్పు చూపించారో గమనించండి. హిందీవిద్యార్థి తన మాతృభాష నేర్చుకోడానికి వారంగీకరించరు. ఇది దీక్ష. దీనికి విఘాతం కలగడానికి వల్లకాదు. ఇక మరొక దేశభాషను దేనినైనా యెందుకోసం అంటే, యిదిగో వారే యిలా చెప్పారు.

"ఆయాదేశభాషలలో పరీక్ష నిచ్చినవిద్యార్థులలో ఆయాభాషలలో పరీక్ష నిచ్చినవారిని ఆయాభాషలు వాడుకలో వున్న ప్రాంతాలలో ప్రచారానికి పంపిస్తూ వుండాలి"

ఏప్రాంతంలో యేభాష వాడుకలో వుందో ఆప్రాంతంలో ఆప్రాంతంవారలే యెందుకు హిందీప్రచారం చేయించరాదూ? అంటే యిందులో వొక రహస్యం వుంది. ఏమిటంటే? అరవదేశంలో తెనుగువారు గాని, తెనుగుదేశంలో అరవవారు గాని హిందీప్రచారంచేస్తారు. అప్పు డేమవుతుంది? "హిందీ దక్షిణదేశభాషలను చంపేసేదే అయితే వీరెందుకు ఈపని చేస్తారూ!" అని ఆదేశీయులను మానపపెడుతూ వుంటారు; కాని చివరికి సర్వమంగళమే. హిందీ దక్షిణదేశభాషలపాలిటి తోకచుక్క. ఏమీ సందేహం లేదు.

హిందీ ప్రచారకులు దక్షిణదేశభాషలను సంహరించబూనిన హిందూస్థానీల భృత్యులు. కాలేల్కరుగారు వారిమీద దండనాయకులు.

మా దేశీయులు మోసపోకుందురుగాక.

గోషా కాదు స్త్రీలను రక్షించేది

హిందూమహాసభయొక్క మొన్నటి వార్షికసమావేశాని కధ్యక్షత వహించిన రవరెండు ఉత్తమాగారు అమృతసరునగరంలో మెయి ౧౧ వ తేదీనా డొక సభలో మహోపన్యాసం చేస్తూ "స్త్రీలకు స్వేచ్ఛ యిస్తే గాని హిందూసంఘం బాగుపడ"దని చాలా తీవ్రంగా చెప్పారు.

హిందూమహాసభయొక్క వెనకటి వార్షికసమావేశానికే గాక, నాటి సభకి కూడా అధ్యక్షత వహించిన భాయి పరమానందుగారు "అన్యమతాలకు చెందిన రుంటర్లు, వీధికి వచ్చిన హిందూ స్త్రీలకు తరుచు మానభంగం చేస్తున్నారు కనక హిందూపురుషులు తమ స్త్రీలను రక్షించుకోగలిగేటంతటి బలం సంపాదించుకునేదాకా స్త్రీలకు గోషా తప్పకుండా వుండా" లని చాలా దృఢంగా చెప్పారు.

చిత్రం!

ఇద్దరూ హైందవాభ్యుదయం కోరేవారే. ఇద్దరూ గొప్ప దేశసేవకులే. పైగా, యిద్దరూ "ముందు సంఘం బలపడా" లనేవారే. కాని స్త్రీల విషయంలో మాత్రం వొక రేటికి తీస్తే వొకరు కోటికి తీస్తున్నారు.

కారణం స్పష్టంగానే వుంది.

ఉత్తమాగారు బర్మీయులు. అన్నివిషయాల్లోనూ సర్వస్వేచ్ఛ గల స్త్రీల మధ్య పెరిగారు వారు.

పరమానందుగారు వుత్తరభారతదేశీయులు. ఎప్పుడూ గోషాలో పడి కుళ్లిపోతూ వుండడమే కాకుండా, యింటో కూడా ముసుగు వేసుకునే తిరిగే స్త్రీల మధ్య పెరిగారు వారు.

ఇలా కావడంవల్ల వారిద్దరూ తమ అనుభవాలనే—తమ సంప్రదాయాలనే అనుసరించి మాట్లాడారు. దీంతో వుత్తరధృవమూ, దక్షిణధృవమూ తయారయినాయి.

అయితే యేమిటి చెయ్యడం?

పరమానందుగారి ప్రాంతంలో మతాంతరు లధికంగానే వున్నారు; కనక అక్కడ గోషా తప్పదంటే నాలుగుగోడల మధ్యనే పడి వుండే గోషాస్త్రీలకు గూడా మానభంగం తప్పడం లేదే!

హిందూస్త్రీలకు మాత్ర మేనా మతాంతరులు మానభంగం చేస్తూవుండడం? హిందూపురుషులు అక్కడ మానవంతులుగానే వుండగలుగుతున్నారా?

ఈదేశంలో యేమతంవారూ కూడా హిందువు లున్నంతమంది లేరే! ఇక వారిలోని కొద్దిమందిరుంటర్లు అధికసంఖ్యాకు లైన హిందువుల స్త్రీలకు మానభంగం యెలా చెయ్యగలుగుతున్నారూ?

అసలు ఈదేశంలో వున్న మతాంతరుల సంఖ్య అంత యెక్కువగా యెలా పెరిగింది? వారందరూ దేశాంతరాలనుంచి దిగుమతి అయినవా రేనా?

మనలో కుల్లెక్కడ ఉందో గుర్తించుకోకుండా మాట్లాడితే ప్రయోజనం లేదు.

ఈదేశంలో వున్న మాహమ్మదీయుల సంఖ్య యేడుకోట్లచిల్లర; కాని పరిశీలించి చూస్తే ప్రతిమహమ్మదీయునిలోనూ యేడేసికోట్ల మాహమ్మదీయులు అంతర్గతులై వున్నారు. అంటే వొక మాహమ్మదీయుడు వీధిలోకి వచ్చాడంటే యేడుకోట్ల వీరాధివీరులు తన చట్టూ చేరారా యిస్తున్నా రన్నంత ధీమాగా వుంటాడు.

ఇక మనం. మన సంఖ్య యిరవై అయిదు కోట్ల చిల్లర. కాని మనలో ప్రతీవాడిలోనూ ఇరవైఅయిదుకోట్ల హిందువులు అంతర్గతులై వుండక పోవడమే కాదు, మనలో వొక్కొక్కడిలోనూ ఒవొక్కొక్కడే లేడు. అంటే వొక హిందువు వీధిలోకి వచ్చాడంటే ప్రపంచకంలో యెక్కడా నావాడన్న వాడు లేనట్లంతే—దూరాన యెవరో పొడిచెయ్యడానికి చూస్తూ వున్నా రన్నంత బిక్కుబిక్కు మంటూ వుంటాడు.

ఏం?

మనం కూడా ఇక్కడ లేనపం లేదు అక్కడ అనుభవించడం లేదు, కథల్లో కూడా అక్కడలేవు. ఇక అసలు? తత్త్వం సంపూర్ణ స్వరాజ్యమే కావాలి;

కోప లేస్తే మాత్రం మనుష్యులం కాము. ఎంచేతా?

ప్రపంచంలో వుండే మతా లన్నీ అసమగ్రా లని, వొక్క మన మతం మాత్రమే సమగ్రం అని మనకి గర్వం. మన కున్న జ్ఞానం యెవరికీ లేదని గీర్వాణం; కాని యేరోజు కారోజు దిగజారిపోతూ వున్న మతం హిందూమతం తప్ప మరోటి లేదు. ప్రపంచకం యొక్క పరిస్థితులు తెలవనీకుండా చేసేది మన జ్ఞానం తప్ప మరోకటి కాదు.

వేదాంతం పేరు చెప్పి మనం ఐహికాన్ని తుచ్ఛంగా పరిగణించుకున్నాము. వైరాగ్యాన్ని పట్టుకు పాకులాడుతూ మన ఇంద్రియాలను కట్టేసుకున్నాం. మతం పేరుచెప్పి మనం బుద్ధిని కలుషితం చేసుకున్నాము. అహింసని నమ్మివేళ్లాడుతూ రక్తాన్ని నీరుచేసుకున్నాము. నానాశాస్త్రాలు కల్పించుకుని మనిషికీ మనిషికీ మధ్య ఆకాశాన్నంటే గోడలనూ, పాతాళం అంటే అగడ్తలనూ నిర్మించుకున్నాము. ముప్పయిమూడుకోట్ల దేవతలను నమ్మి చివరికి మనం మానవత్వాన్నే కూనీచేసుకున్నాం.

ఇంతే కాదు. మన విజ్ఞానం "నేను" అంటే "కనపడనిదీ, వినపడనిదీ, ఏమీ లేనిదీ" అన్నంతదాకా పెరిగిపోయింది.

ఈసిద్ధాంతా లన్నీ మన రక్తంలో అణువు అణువునా జీర్ణించిపోయాయి.

ఒకవేళ ఇతర్లని చూసి మన మనస్సు కొంచెం పురెక్కినా కాళ్లూ, చేతులూ, కళ్లూ —ఏఅవయవాలూ చెప్పిన మాట వినవు.

మన సిద్ధాంతంలో ఈమానవజన్మకి పరమావధి అడివిలో ముక్కు మూసుకు కూచోడం తప్ప మరేమీ లేదు.

ఇక మన కేం వుందీ?

హిందూమహాసభయొక్క ప్రాప్యమూ, కార్యక్రమమూ మాకు బాగా తెలవవు; కాని కొంత్తంమీద మనం పునాది మాట మరిచే పోయి నేలమీదే గోడలు—అవేనా బొందు యిసకతో తయారు చేసుకుంటున్నాం. అంచేతే మన ప్రయత్నాలు ఎప్పటి కప్పుడే—ఎక్కడి కక్కడే నేలమట్టం అయిపోతున్నాయి.

చివరికి మనం యెక్కడ బయలుదేరామో అక్కడికే చేరుకుంటున్నాం. ఒకొక్కప్పుడు వెనక్కి కూడా వెళ్లిపోతున్నాం.

తెనుగువ్యాసమూ ఉండేనున్నా

మొన్నటి మెయి ౨౦వ తేదీని హైదరాబాదు నగరంలో శ్రీకృష్ణదేవరాయల ఆంధ్రభాషానిలయంలో హైదరోనుకేలు బూర్గుల రామకృష్ణారావుగారు అధ్యక్షత క్రింద వొక మహాసభ జరిగింది. ... చివర మతం వీరభద్రశాస్త్రి గారు మహోపన్యాసం చేశారు.

"మత్తి పాండిత్యం యేమవుతేనే! విషయం యేమైంటేది! ఉపన్యాసం యేమి వుంది?" ఈవిషయాలతో యిప్పుడు మాకు ప్రసక్తి లేదు

ఇక వున్నదీ కోవలసినదీ యేమి టంటే!

సక జీవిత సంగ్రామం తెనుగుమాగాణానికి సంబంధించే...

స్థలం ప్రాంతీయ్యనిదేయము డైన ... ప్రతిష్ఠించబడ్డ ఆంధ్రభాషానిలయం.

సభ్యు లందరూ ఆంధ్రులు.

అధ్యక్షులూ ఆంధ్రులు.

ఉపన్యాసకులున్నూ ఆంధ్రులు.

కాని,

కాని వుపన్యాసకులూ, అధ్యక్షులూ కూడా తమ వుపన్యాసాలు హిందీలో చేసుకొన్నారు.

చివర, అధ్యక్షులు హిందీలో ప్రారంభించగా శ్రీ మాడపాటి హనుమంతరావుపంతులు గారు తెనుగులో మాట్లాడ మన్నారు; కాని "వుపన్యాసకులు హిందీలో మాట్లాడారు కనక నేనూ హిందీలోనే మాట్లాడతా" నని జవాబు చెప్పి హిందీలో ముగించారు.

దీనిమీద "అల్లరిపిల్లాళ్లు" అనే పేరితో వొక పెద్దమనిషి, "చిదిరెమతం వీరభద్రశాస్త్రి గారంటే, ఉపన్యాసాదిలోనే మనవి చేసుకున్నారు తాము తెనుగులో మాట్లాడలేమని. యెనిమిది సంవత్సరాలనుంచి వారి (తమ) తెనుగుకర్తృత్వం మానం వహించినదని" అని వుపన్యాసకులను సమర్థిస్తూ, అధ్యక్షులవారి హిందీవుపన్యాసాన్ని ఆక్షేపిస్తూ నారికేర గోల్కొండపత్రికలో వొక బహిరంగ లేఖ ప్రకటించారు.

వీరభద్రశర్మ గారు కాశీలోనే చదువుకుని వుండవచ్చు; కాని వారు నల్లగొండజిల్లాకు చెందిన అచ్చతెనుగువారు, హనుమంతరావు

పంతులుగారి కంటేనూ, రామకృష్ణారావు పంతులుగారికంటేనూ, యీ "ఆధునిక్ హింద్ స్టానీ" కంటేనూ వారు తెనుగుశాసనంలో కన్న—వ వారు కారు. అలాంటి పెద్దమనిషికి హిందీలో మాట్లాడానికి యిష్టమవుంటే, వున్నా వారికి మాట్లాడే భాషలోనే ఆత్మగౌరవం మాటాడడం యేం తప్పా?

కాని, తెనుగువారు లేకున్న సభలో తెనుగువారు తెనుగులో తప్ప మరో భాషలో మాట్లాడడం పండితత్వానికి, ప్రపంచవృత్తానికి చాలా దూరం.

శర్మగారికి కాశీలో తెనుగులో మాట్లాడానికి అవకాశాలు లేక పోయా యున్నా, అవసరం లేకపోయిందన్నా, మేము అంగీకరించం. అంగీకరించినా వారు తెనుగు మరిచిపోవలసిన అవసరం లేనే లేదు.

అయితే. ప్రపంచకంలో ఆంధ్రుడు తప్ప మరేజాతివాడయినా సరే తన భాష కాక పైభాష నేర్చుకునేటప్పుడు తిరగతిలో వీలు లేకపోయినా యింటో నేనా తన భాషలో వున్న పుస్తకాలు చదువుతాడు. పరభాషలో వుపన్యసించతగినంత పాండిత్యం సంపాదించుకున్నవాడు తన మాతృభాషాగ్రంథాలు ఇంటో వుంచుకోకుండా అసలు సంసారమే చెయ్యడు. పైగా తన పెళ్ళాంతో, తనభాషలో మాట్లాడకలిగే—సంస్కృతపండితుడైన హిందువు తన భాషలో వుపన్యాసం చెయ్యలేకపోడు. ఏమంటే? చివర తెనుగు ప్రత్యయం చేర్చితే యెంతటి దీర్ఘ సంస్కృతసమాస మైనా తెనుగులో నేజము అయిపోతుంది కాదూ?

ఒక్క హిందూస్థానీగారి సంగతే కాదు సంస్కృతంలో ఇంగ్లీషులో—మరే పరభాషలో నేనా సరే పండితుడైన తెనుగువాడి ప్రవృత్తి యిలాగే వుంది. వారు పండితులే. సందేహం లేదు. మేమూ కాదనము; కాని వారు స్వయంగానూ తెనుగులో లేరు. ఇతర్లని మార్గీ బోధపరుచుకోలేరు.

తెనుగువారు "తెనుగువాడికి జాతి లేదు. సంప్రదాయం లేదు. భాష లేదు. చివరకి నీతి కూడా లేదు" అని పరాయివారనిపోతారేమో అని భయపడి నేనా భయపడరు.

తెనుగువాడి వ్యాసంగం చాలావిశాల మయినది. నిజమే. అయితే అందులో స్వత్వం యేమీ లేదు. అంతా పరాయివాళ్ళకే భుక్తం.

ఇలాంటి తెనుగువాడేనా భారతజాతీయతకి పుష్టి కలిగించగలవాడూ?

సామాన్యభాష యెందుకూ? ఎవరికి?

"........సామాన్యభాష దేశానికి కావలసిన సమయము వచ్చినప్పుడు హిందీకే వస్తున్నది. కాని, ఆ అవసర మిప్పుడు కాదు అని చెప్పబోతే, ఇది సమయమే అని చెప్పడానికి పదిహేను సంవత్సరాలూ, కొన్ని లక్షల రూపులూ ఎదురొడ్డగలవు. దక్షిణభారతములో హిందీప్రచారము జరపడంలో భాషలమీద దొంగదాడి కూడా నిర్వాహకుల సంకల్పమే అని చెప్పదలిస్తే అది రుజువు చెయ్యడానికే ఆస్కారము చాలదు......"

—ఉదయిని (ఫిబ్రవరి)

ఉదయిని మొన్నటి డిసెంబరులోనే తలయెత్తిన కొత్తపత్రిక. దానికి తెనుగుదనువర్న మన స్వత్వం యింకా యేమీ అవగాహన కాలేదు. అదృష్టవశంవల్ల తత్సంపాదకులు కూడా ప్రతీ గుమ్మటూ యొక్క చందావారులను చేర్చుకుంటున్నారు; కనక హిందీదురాక్రమ ణపరిమితి కొద్దిమాసాల్లోనే వారికి తెలియవస్తుం దని నమ్ముతున్నాము.

ఒక్క సంగతి మాత్రం ఉదయిని గ్రహించవలసివుంది. హిందీని సాగని బెట్టుకుని పదిహేను సంవత్సరాలే మమ్మల్ని యెదిరించ గలవు. కాని యింగ్లీషుని శిరసావహించి మాటమాత్రపై సంవత్సరాలు ముట్టడించే వున్నాయి. ఉదయిని దీని కేమంటుంది! హిందీని వెనక వేసుకువచ్చి కొన్ని లక్షలరూపులే మాకు అడ్డు తగుల్తాయి; కాని ఇంగ్లీషుని పురస్కరించుకుని అనేక లక్షల రూపులు గతినిరోధమే కలిగించివున్నాయి. తాను ప్రతిపాదించిన ధర్మసూత్రాన్ననుసరించి ఉదయిని. మనకి సామాన్యభాష కావడానికి హిందీకి కంటే ఇంగ్లీషుకే సత్తా యెక్కువగా వుందని గ్రహించిందా?

ఇక దొంగదాడి విషయం. కాలేల్కరుగారూ, అలాంటివారూ చెప్పే మాటలు చాలా చాలా తియ్యగా వున్నాయి. అయితే ఆతీపి పైపూతమాత్రమే. వారు చెప్పే మాటలకి అర్థం యేమిటో, వారు చేసే పనుల వ్యాఖ్యానం యెలా వుంటుందో కొంచెం నిదానంగా ఆలోచిస్తే—ఘోరంగా నమ్మకుండా కొంచెం పరిశీలిస్తే లోపల వున్న చేదు అనుభవానికి వస్తుంది. సామాన్యభాష అంటే దాని ప్రయోజనం యేమిటో. దాని అవసరం యెలాంటివారికో, కాలేల్కరుగారూ, చివరికి గాంధిగారూ ఎలాంటివారికి కూడా హిందీని పాయం పోయిస్తున్నారో, పైగా హిందీ సామాన్యభాషగా చెలామణీ కావడాని కిప్పుడేమేనా వీళ్ళున్నారూ లేవో—ఉదయిని ఆలోచించి చెబుతుం దని నమ్ముతున్నాం.

"హిందీప్రవాహాన్ని ఈసంవత్సరంలో అరికట్టి చెప్పుకోతగ్గ పని చేశామనే "ప్రబుద్ధాంధ్ర" నిజానికి ఏమీ చెయ్యలేదు. ఇది పరిహాసం కాదు. మరి యెన్నాళ్ళకు గురికి సాధ్యంకాదు............ ఈ వ్రాతలు హిందీపాఠకుల ఉత్సాహాన్ని యినుమడింపజేసినవి. హిందీపాఠకులు యిప్పుడు దేశంలో ఎలరేగారని మాసమకాలిక సోదరి యింకా గ్రహించకపోవడం ఆశ్చర్యం"

జనవరి ప్రభాతం మమ్మిలా ఆక్షేపించింది. యిదివరలో మాకీ రాతలు బోధపడలేదు. కాని మెయి నెల భారతీ, జ్వాలా మాకొక కొంచెం తెలిపాయి. భారతి, ఆంధ్రపత్రికల నవ్యసాహిత్యాచార్యులు ...ల శివశంకరశాస్త్రిగారు భారతిలో తమ తెలుగుపద్యాన్ని హిందీలో ముకుటం వుంచారు. జ్వాలలో రిపోర్టు అనే తమ కథలో హిందీవాక్యాలకు వాక్యాలే ధారాళంగా వాడేశారు. అంతే కాదు, వారు రిపోర్టులో ఇంగ్లీషుమాటలు ఇంగ్లీషులిపిలోనే చూపించారు.

సంపాదకుడు)

౧

"........మీహిందీ విషయం—నా ఉద్దేశం మీరు సరిగా అర్థంచేసుకోలేదు. ఈవిషయంలో మీ వ్యాసాలంటూ నేను చదువుకోలేనందుకు చెబుతాను. మీరు హిందీనీ, హిందీప్రచారకులనూ మాత్రమే అనుమానంతో చూస్తున్నారు. నేను ఇంగ్లీషునూ, ఇంగ్లీషు ఉపాధ్యాయులనూ, గ్రాంథికాన్ని, గ్రాంథికవాదులనూ కూడా అనుమానంతోనే చూస్తున్నాను. అయిదో ఏట హిందీ అక్షరాభ్యాసం చెయ్యటానికి మీ కభ్యంతరం. ఆరో ఏట ఏదీ చెప్పటం నాకభ్యంతరం. పన్నెండేళ్లు వచ్చిదాకా ఇతర భాష కుర్రవాడికి నేర్పకూడదు శాస్త్రప్రకారం. ఏకొద్దిమంది కోసమో మీరు ఆందోళన చేస్తున్నారని అనుకోకుండా ఉండలేక పోతున్నాను. మీరింతా చెప్పి ఒక్క విషయం చెప్పరేం? అదేమంటే? హిందీ చదువుతున్నవాళ్లు హిందీకథలు తెలుగులో రాయటానికి ఉపయోగించే తెలుగు. అది చూస్తే నాకు మండిపోతుంది. ఆమాటకొస్తే ఇంగ్లీషువాళ్లు (చదువుతున్నవాళ్లు) రాసే తెలుగూ అందానుకోండి. ఇంతకూ—మీభయాలు నిరాధారా అని నేను వాదు చెయ్యలేను......"

—కొడవటిగంటి కుటుంబరావు

(గ్రాంథికమూ, ఇంగ్లీషూ కూడా మన కపకారం చేస్తున్నాయి. నిజమే. వాటివల్ల జరిగే అపకారాన్ని తగ్గించుకోవలసిందే. అయితే దానితోపాటు వాటికి ఇంకో భాష జతపడుతూ వుండేటట్టు ముందు మానుకోవద్దూ? ఇంగ్లీషులో బి. ఏ. చదివినవాళ్లు కూడా కాలేజీ విడిచిపెట్టాక యిలాగుంది ఇంగ్లీషు సాహిత్యమూ, మరి కొనడం లేదు. చూపెడమున్నా లేదు. కొనేవారిలోనూ, రాసేవారిలోనూ నూటికి తొంభైమంది ఆంధ్రవాఙ్మయాన్ని కూడా కొంటూ చూస్తూవున్నారు. మా అనుభవంలో—ప్రబుద్ధాంధ్రను పోషించేవారిలో నూటికి తొంభైతొమ్మండుగురు ఇంగ్లీషులో పట్టభద్రులు అయినవారే. ఇక హిందీపాఠకుల విషయం. హిందీ ప్రారంభం చేశారంటే వారు హిందీపత్రికలూ, పుస్తకాలూ వందలకొద్దీ కొంటారు. తెలుగువాఙ్మయాన్ని ముట్టరు. చూడరు. పైగా తెలుగు గొంతు కంటారు. తెలుగులో ఏముందంటారు. తెలుగూ వొక భాషేనా అంటారు. తెలుగును చంపెయ్యాలంటారు. దక్షిణభారతహిందీప్రచారసభ యిందుకోసమే పుట్టి, యీపనే చేస్తోంది. హిందూస్థానీలు కాంగ్రెసు బురఖా వేసుకువచ్చి మనవాళ్ళకి యీ వుపదేశమే చేస్తున్నారు. కలెక్టరుగారు దక్షిణదేశభాషలను చంపెయ్యడమే తమ జీవితసాఫల్యం అని నమ్మి పని చేస్తున్నారు.....ఇంతకీ ఇంగ్లీషుకి వశీకరించింది. అది హిందీకి సంక్రమించింది. ఇక్కడి హిందీప్రచారంకోసం హిందూస్థానీల దగ్గరనుంచి లక్షరూపాయలు వస్తున్నాయి. ఆ లక్ష రూపాయలూ యిక్కడి కోటిరూపాయలు ఆర్జించి మనం మన దక్షిణదేశభాషలను కలిగిఉన్న గౌరవాన్ని నిమిషాలమీద బుగ్గిచేసేస్తాయి. ఇంకొకటి. ఇంగ్లీషు చదవడంవల్ల హిందువులనేవాళ్ళు హిందూదేశానికి ప్రపంచకంలో వొక గౌరవస్థానం సంపాదించారు. హిందీ నేర్చుకుంటే, ఇప్పట్లో, మాతృభాషలను అవమానపరచడం ద్వారా కనుప్పకి సంపాదించుకోవడమూ, హిందూస్థానీలకు భావదాస్యం చెయ్యడమూ తప్ప మరేమీ ప్రయోజనం లేదు. ఆమాటకి వస్తే హిందీకి, అసలు, కాంగ్రెసులోనే అర్ధచంద్రప్రయోగం ఎదురవుతోంది. ఇక హిందీ చదువుతున్నవాళ్లు హిందీకథలు తెలుగులో రాయటానికి ఉపయోగించే భాషసంగతి. ఈ సందర్భంలో ఇటీవలనే మాకొక సత్యాగ్రహిప్రముఖులు (శ్రీమతి దుర్గాబాయమ్మగారి తెలుగును పరిచయపరిచారు. కుటుంబరావుగారు కూడా తమకు తెలిసినవాటిని చూపిస్తారని నమ్మి ఆశిస్తున్నాము.

—సంపాదకుడు)

ఒకసలహా

సంపాదక మహాశయా!

ఆంధ్రుల అభ్యుదయమే పరమావధిగా ఆంధ్రలోకమున నవతరించి అనతికాలములోనే [illegible] గాంచిన మన ‘ప్రబుద్ధాంధ్ర’ నాడు నాటికి తన గవ్యస్థానమును సమీపించుచుండుట పరమానందజనకముగ నున్నది. ఆంధ్రుల యాంధ్రత్వమును నిలువబెట్టి వారి గౌరవప్రతిష్ఠలు పెరుగుటకు గావించుచుండు కృషి అభినందనపాత్రము. అనన్యమగు యాంధ్రత్వమును దానికబ్బజేసిన తాము అభినందనార్హులు. సజీవములగు [illegible]ములు, దాక్షిణ్యదూరములు, తత్త్వప్రదర్శకములు నగు [illegible] యాంధ్రలోకాభ్యుదయాకాంక్షను [illegible] ప్రకటించుచున్నవి. ప్రస్తుతమున్న తెలుగు పత్రికలలో [illegible] ‘ప్రబుద్ధాంధ్ర’ అగ్రస్థానము నలంకరించగలదనుట అతిశయోక్తి కాదు.

ఇతర వ్యాసముల విషయమున నన్ను ప్రశ్నించలేదు. [illegible] [illegible] [illegible] [illegible] [illegible] ‘ప్రబుద్ధాంధ్ర’ [illegible] [illegible] [illegible] [illegible] [illegible].

ఆంధ్రుల [illegible] ప్రబుద్ధాంధ్ర [illegible] [illegible] ప్రకృతిని [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] ‘ప్రబుద్ధాంధ్ర’ [illegible] [illegible]. ఆ [illegible] ఆంధ్రులలో [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] తేగలిగిన [illegible]. అప్పుడే ‘ప్రబుద్ధాంధ్ర’ సర్వాంగీణముగ [illegible] సార్థకపరచుకొనగలదు.

ఇట్లు

—గన్నవరపు సుబ్బరామయ్య

వినోదశిల్పము

పసిపిల్లల హృదయాలు ఎప్పుడూ ఏవో అవ్యక్తాలయిన భావాలతో నిండి ఉంటుంది. చేతికి చిక్కిన వస్తువుల్ని [illegible] [illegible] మార్చవలెనని వాళ్లు కోరుతారు. అది అసాధ్యం అయినా ప్రయత్నం మానరు. నయస్సు పెరిగేకొద్దీ అభావాలు వ్యక్తరూపాన్ని [illegible]తూ ఉంటవి.

వాటికి రూపం కల్పించడంలో వాళ్లు ప్రకృతిని అనుకరిస్తూ ఉంటారు. ఇది శిల్పానికి ప్రథమావస్థ. అది మొదట వినోదానికే అయినా తర్వాత ఉపయోగానికే వస్తుంది. అయితే దానికి అలవాటు కావాలి. దానికోసంగానే బళ్లలో కట్టువాళ్లకు చదువుకంటె ముఖ్యంగా శిల్పం నేర్పడం ఏర్పాటయింది.

ఇదివరకు ఈ శిల్పాన్ని బళ్లలో కుట్టువాళ్లకు ఉపాధ్యాయులు బోధపరచి మాదిరి చేసిచూపి వాళ్లచేత చేయిస్తూ ఉండడం అలవాటు. కాని దాన్ని వివరంగా తెలిపే పుస్తకాలేవీ తెలుగులో లేకపోయినవి. ఈ ‘వినోదశిల్పము’ మొదటిపుస్తకం అవుతూంది.

ఈ పుస్తకంలో కాగితాలు, ఆటలు, తీగలు, పుడకలు, తాటాకులు మొదలయినవాటితోనూ, నూలూ, ఊలూ అల్లడమూ, [illegible]తోనూ, కొంత వినోదంగానూ, కొంత ఉపయోగకరంగానూ ఉండే (౧౦–౬౦) వస్తువులను తయారుచేసే విధానం వివరంగా మాదిరిబొమ్మలతో సహా చెప్పబడి ఉంది. ఈ విషయం [illegible] [illegible] [illegible] [illegible] ‘[illegible]’ [illegible] ప్రకటించారు. [illegible] [illegible] శ్రీ [illegible] [illegible] ఇట్లా ఆంధ్ర [illegible] [illegible] పుస్తకంగా ప్రకటించారు. ఈ ప్రయత్నం చాలా మెచ్చదగినది.

ఈ పుస్తకం బడిపిల్లలకు చాలా ఉపయోగకరం అయి [illegible] [illegible] [illegible] చెప్పిన వస్తువులను తయారుచేసుకొని లాభం పొందవచ్చును.

[illegible] [illegible] పుస్తకం ఈ ‘వినోదశిల్పము’ తెలుగు [illegible] [illegible] [illegible] [illegible] ఏర్పాటు [illegible] ‘విద్యాశాఖ’ [illegible]. ఈ పుస్తకము వెల ౧౧–౪–౦ ఇది [illegible] మండీలోని ప్రబుద్ధాంధ్ర కార్యాలయంలో దొరుకుతుంది. [illegible]

[illegible] స్వామి జీవితము

గ్రంథకర్త: బులుసు [illegible] [illegible] [illegible]. ఎ.; [illegible] వెల ౧ ౦–౮–౦.

జీవించినది ముప్ఫయిరెండేళ్లు. [illegible] [illegible] [illegible] విద్యార్థిదశ. సుమారు ఆరు సంవత్సరాలు ఉద్యోగం. కాని [illegible] కాలంలో మహావిద్య [illegible] [illegible] [illegible] [illegible] పొంది, భారత [illegible] వీధులను [illegible] వెలిగించి [illegible] మించిన తపోధనుడు రామతీర్థస్వామి.

అతని జీవితాన్ని అనర్ఘంగా ఉంచుకోవడం ప్రతివారికీ సాధ్యం కాదు. కాని స్వాతంత్ర్యములై, మహోన్నతములై నూతనమైన అతని బోధనలు మాత్రము నిత్యస్మరణీయములు; నిత్యానుసరణీయములు. స్వామి ఉపదేశవాక్యాలు కొన్ని ముఖ్యములైనవి ఇందులో [illegible] చేయడం ఒకవిశేషము.

జీవితచరిత్రలంటే. అందులో వేదాంతతత్త్వజ్ఞుల జీవితముల [illegible] అభిరుచి తక్కువరోజులివి. ధారాళంగా బోధపడే సులభశైలిలో ఉంది. సాగుతున్నకొద్దీ చదువుతూన్నట్లుగా చదివేవాళ్లని ఆకర్షించే జీవితచరిత్రలు [illegible] ఈ పుస్తకంలో [illegible] [illegible].

భాష గ్రాంథికం. విషయగౌరవాన్నిబట్టి భాషాశైలీ ఉండాలనే అభిప్రాయం కలవారిలో ఒకరుకాబోలు గ్రంథకర్తగారు! [illegible] ఉపమ, ఉత్ప్రేక్షాద్యలంకారాలతో కఠినపాకాన్ని బడిపోయి [illegible] కొన్నిచోట్ల బహుకఠినం. అయితే ఉద్యమంగొప్పది. శ్రమతీసుకొని ఒక మహాపురుషుని జీవితాంశమును గ్రంథస్థంచేసిన వెంకటేశ్వర్లు గారు అభినందనీయులు.

కా. వెం. రా.

సరస్వతీ గ్రంథమండలి

కంభంవారి సత్రమువీధి *** రాజమహేంద్రవరము

నవలలు—నవరసభరితములగు నవలలు—ముచ్చటగూర్చు బొమ్మలతో—ముద్దులొలుకు శ్యాలికో బయిండుతో—రెండుమాసముల కొక్క చక్కని నవల. నడుమ నడుమ చిన్న చిన్న అనుబంధగ్రంథములు వెలువడుచుండును. చందాదారులకు ప్రవేశరుసుము రు 0–4–0 చందాదారులు ఒకేసారి రు 7–8–0 ను ముందుగా పంపినచో వరుసగా ఆరుపుస్తకములు అన్‌రిజిస్టర్డు పార్శిలుగా పంపుదుము.

ఇంతవరకు వెలువడిన గ్రంథములు

11	ప్రేమసుందరి	1 8 0
12	చోరశిఖామణి	1 8 0
13	లక్ష్మీప్రసాదము	1 8 0
14	హాస్యరహస్యము	1 8 0
15	ఫాస్టు (1 భాగము)	1 8 0
16	ఫాస్టు (2 భాగము)	1 8 0
17	కుముద్వతి	1 8 0
18	చిన్నకోడలు	1 8 0
19	రహస్యభేదనము	1 8 0
20	సింహగడము	1 8 0
21	మణిహారము	1 8 0
22	మొగలాయీదర్బారు 1 భాగము	1 8 0
23	ఘటనాచక్రము	1 8 0
24	రాజసుందరి	1 8 0
25	కుంకుమభరణి	1 8 0
26	జాగిలము	1 8 0
27	మొగలాయీదర్బారు 2 వ భాగము	1 8 0
28	సరస్వతి	1 8 0
29	ఆనందాభాయి	1 8 0
30	హాస్యాన్వేషణము	1 8 0
31	మొగలాయీదర్బారు 3 వ భాగము	1 8 0
32	గంగ	1 8 0
33	మొగలాయీదర్బారు 4 వ భాగము	1 8 0
34	కోహినూరు	1 8 0
35	ఆటీన్ మణేలా	1 8 0
36	అపరిచిత	1 8 0
37	అంతఃపురము 1 భా॥	1 8 0
38	అంతఃపురము 2 భా॥	1 8 0
39	అగ్రహారము	1 8 0
40	ఛిన్నహస్తము 1 భా॥	1 8 0
41	ఛిన్నహస్తము 2 భా॥	1 8 0
42	కంకణరహస్యము	1 8 0
43	సంజీవి 1 భా॥	1 8 0
44	సంజీవి 2 భా॥	1 8 0
45	వ్రజరాణి	1 8 0
46	హాస్యభ్రమ	1 8 0
47	కాశఖండము	1 8 0
48	సేవాశ్రమము 1 భా॥	1 8 0
49	సేవాశ్రమము 2 భా॥	1 8 0
50	దాసీకన్య	1 8 0

అనుబంధములు

1	మృత్యురంగిణి	0 12 0
2	అభాగిని	0 12 0
3	ఛద్మవేషి	0 12 0
4	విదురుని యువ దేశములు	1 0 0
5	కాంచనమాల	1 0 0
6	సీమంతిని	1 0 0
7	సుశీల	1 0 0
8	శశిరేఖ	1 0 0
9	యమునాబాయి	1 0 0
10	శ్యామల	1 0 0
11	కాంతంకథలు (చిన్నకథలు)	1 0 0
12	కాలసర్పి	1 0 0
13	భారతకథాసారం	1 0 0
14	కథాకల్పవల్లి (చిన్నకథలు)	1 0 0
15	అరజుణీయ	1 0 0
16	మాధవి	1 0 0
17	లలిత	1 0 0
18	పెండ్లిదండ	1 0 0
19	కథావళి	1 0 0
20	నాలుగుకథలు	1 0 0
21	నీతిప్రబోధిక	1 0 0
22	ఆదర్శము 1 భా॥	0 12 0
23	ఉదంకుడు	0 12 0
24	భేతాళకథలు	0 12 0

నాటకములు

1	మార్కండేయ	0 12 0
2	అహల్యాశాపవిమోచనము	0 12 0
3	మీరావారుపతనము	1 0 0
4	వరమాల	1 0 0
5	షాజహాను	1 0 0
6	నూర్జహాను	1 0 0
7	దుర్గాదాసు	1 0 0
8	చంద్రగుప్త	1 0 0
9	దంపతులు	1 0 0
10	విజయువిజయం	1 0 0
11	భక్తకుచేల	1 0 0

ఈ గ్రంథములు రాజమండ్రిలో కళాభివర్ధనీ పరిషత్తులలోను దొరకును.

సరస్వతీ పాకెట్ డిక్షనరీ యొక్క ఒక నమూనా పుట:—

Garment—*n.* మనుష్యులు లోని ఏదేనివస్త్రము, బట్ట

Garner—*n.* ధాన్యము నిలువ పోయు కొట్టు; *v. t.* నిలువ పోయు, కూడబెట్టు

Garnet—*n.* కెంపువంటి గాజురాయి

Garnish—*v.t.* అలంకరించు; *n.* అలంకారము; *also n.* Garnishment

Garret—*n.* మిద్దెగది

Garreteer—*n.* మిద్దెగదిలో వసించువాడు

Garrison—*n.* కోటలో నుండు రక్షణసేన; *v. t.* రక్షణసేననుంచు

Garrote (-tte)—*n.* పీకపిసికి చంపుపద్ధతి. ఇట్టి పద్ధతితో కూడిన స్పెయినుదేశపుమరణశిక్ష; *v. t.* పీక పిసికి చంపు గొంతుక పిసికి దోచుకొను

Garrulous—*adj.* అధిక ప్రసంగియైన

Garter—*n.* మేజోడు దిగజారకుండ నుంచెడు నాడా; *v. t.* ఇట్టి నాడాతో కట్టు

Gas—*n.* వాయువు; పట్టికబుగ్గ డాబుమాటలు, గప్పాలు; *v. t.* వాయువునుసమకూర్చు; విషవాయువును వదలిచంపు; *v. i.* పట్టికబుగ్గ లేక డాబులు చెప్పు

Gaselier—*n.* పలుకైపుల కొమ్మలుగలిగి వ్రేలాడునట్టి దీపము

Gaseous—*adj.* వాయురూపమైన నున్న

Gash—*v. t.* లోతుగ కోయు; *n.* లోతుగ తెగిన పొడవైన గాయము

Gas-light—*n.* వాయు సహాయమున వెలిగెడు కాంతిగల దీపము

Gasp—*v. i. & v. t.* ఊపిరి తీయుటకు నోరు తెరచు; *n.* ఎగఊపిరి

Gasping—*adj.* ఎగరొజు చున్న; *n.* ఎగఊపిరి

Gassy—*adj.* వాయుపూర్ణమైన; వాయువువంటి

Gastric—*adj.* కడుపు సం. మైన; Gastric juice జీర్ణద్రవము; జఠరద్రవము

Gastrology—*n.* పాకశాస్త్రము, hence Gastrologist & Gastrologer *n.*

Gastronomy—*n.* రుచుల నెతింగింపుశాస్త్రము; తిండిబోతుతనము

Gate—*n.* బహిర్ద్వారము;

సరస్వతి ఇంగ్లీషు-తెలుగు పాకెట్టు డిక్షనరీ

Saraswathi *English-Telugu* POCKET DICTIONARY.

సరస్వతీ పవర్ ప్రెస్, రాజమండ్రి.

డెమ్మీ సాయిజు—665 పేజీలు

మొత్తము 17000

ఇంగ్లీషు పదములకు సులభముగా తెలుగు అర్థములు—బాలబాలికలకు మిక్కిలి యుపయోగకరము.

పక్కాగా బైండుచేయబడినది.

వెల ప్రతి 1 కి రు 1-8-0

అచ్చులోనున్నది!



వస్తుగుణ ప్రకాశిక

సరస్వతీ పవర్ ప్రెస్ వారి ప్రచురణము, రాజమండ్రి

మంచిగ్లేజు కాగితము! సొగసైన క్యాలికో బైండు!! పుస్తకములో వస్తుగుణప్రబోధముగల పేజీలు 1000 పైగా నుండును. వెల ప్రతి 1 కి 5-0-0

ఇది సమస్తద్రవ్యగుణములను అసందిగ్ధముగ తెలియజేయు అపూర్వగ్రంథరాజము. ఆంధ్రవైద్యలోకమునకు, వైద్యేతరులకును మిక్కిలి యుపయోగకర మగునటుల బ్రహ్మశ్రీ ఆయుర్వేదభూషణ భిషగ్వర పండిత పీటూరి వాసుదేవశాస్త్రి, ఏ. యం. ఏ. సి. గారిచే వ్రాయబడినది. ఇందు సందిగ్ధద్రవ్యములన్నియు నిర్ధారణ చేయబడి ప్రచురింపబడినవి. నూతనపరిశోధితద్రవ్యములు చేర్చబడినవి. వస్తువునందలి రసవీర్యవిపాకప్రభావములను గుణములను విడదీసి వస్తు... [illegible]

వస్తుగుణప్రకాశిక మాదిరి పేజీ.

కటుకరోహిణి:—కటుకా—Picrorrhiza kurroa Veronicalindleyana.

పరిచయపదములు శతపర్వా - చాలా గణుపులు గలది. కాండరుహా - కాడయే మొలచునది. చక్రాంగీ - ముక్కగొట్టిన చక్రాకారముగ నుండునది. గుణబోధినీపదములు: అనుఘ్నీ - అనుదోషమును పోగొట్టునది.

స్వరూపము ఇది గుల్మజాతిలోని మొక్క. ఆకులు కొంచెము పొడవుగను, కంగోరా గలిగి కుక్కపొగాకు ఆకులవలె నుండును. దీని పూవులు నీలిరంగు గలిగి గుత్తులుగా నుండును. దీనిలో రెండు జాతులు కలవు. నీలిరంగుగల దొకటియు, పచ్చరంగుగల దొకటియు. హిమాలయ ప్రాంతప్రదేశములలో నిది విస్తారముగా నుండును. దీని వ్రేళ్లనే యౌషధములకు వాడుదురు.

గుణములు ఇది చేదురుచి గలిగి యుండును. వేడిచేయు స్వభావము గలది. విపాకమున కారపు రుచిగ మారును. రూక్షలఘుగుణములు కలది బాగుగా విరేచనమును జేయును. అగ్నిదీప్తిని గలిగించును. హృదయమునకు హితకరమైనది. కఫపిత్తజ్వరములను హరించును. ప్రమేహములు శ్వాసకాసలు, రక్తతాపము, కుష్ఠరోగము, క్రిములు హరించును. విషమజ్వరములను పోగొట్టును.

ప్రయోగములు హృద్రోగమునకు:—కటుకరోహిణి, యష్టిమధుకము ను మెత్తగా నూరి పంచదారనీళ్లతో కలిపి త్రాగిన హృద్రోగములు శమించును.

స్తన్యశుద్ధికి:—దీని వేళ్లు పాలతో గాని నీళ్లతో గాని నూరి త్రాగిన స్తన్యము శుద్ధమగును.

కఫపిత్తజ్వరములకు:—కటుకరోహిణి ఉసిరికాయంత ముద్ద వేడినీళ్లలో కలిపి కొంచెము పంచదార వేసి త్రాగిన క్రిములను పోగొట్టి విరేచనమును జేసి జ్వరములను తగ్గించును.

ఎక్కిళ్లకు:—గైరికమును, కటుకరోహిణియు సమానములుగ చూర్ణించి తేనెతో కలిపి యిచ్చిన ఎక్కిళ్లు శమించును. (సుశ్రుతము)

కటుకరోహిణి కషాయములో సదాపాకు చూర్ణము కలిపి మూడు రోజులు తెల్లవారుజామున నే త్రాగిన ఋతురక్తము జారీయగును. కటుకరోహిణి గుంటకలగరాకు రసముతో నొక వారము దినములు మర్దించి కందిగింజలంత మాత్రలు చేసి అల్లపురసముతో నిచ్చిన చలిజ్వరములు కట్టును. చిట్టినారమట్ట రసముతో కటుకరోహిణిని మెత్తగా నూరి గుండెలకు పట్టువేసిన గుండెలలో పీకునొప్పి తగ్గుటయే గాక, శ్లేష్మము కరగి ఆయాసము తగ్గును. లోపలికిచ్చు మోతాదు ఎక్కువైనచో వికారము గలిగించును. కటుకరోహిణిలో రెండువరకములు: తెల్లది నల్లదానికంటె తీక్ష్ణమైన గుణములను గలిగి యెక్కువ విరేచనమును జేయు స్వభావము గలిగి యుండును. వాడుకలో నల్లదానికంటె తెల్లది తక్కువ మోతాదుగనే వాడవలయును. లేక వికారము వాంతియును గలిగించును. దీనిని పైన పట్టువేసినచో పొక్కును. దీనికి బాదమునూనె గాని పప్పుగాని విరుగుడువస్తువు.

నవీన వైద్యక మతము ఇది రసాయనము. చేదురుచి, పాచనకారి, పైత్యహరము. అజీర్ణము, గ్రహణి, శ్వాస, పిత్తవికృతులు, కామల మొదలగు రోగములయందు దీనిని బాగుగా వాడవచ్చును. యకృద్వృద్ధిలో నిది చేదుపుచ్చతో సమానముగా పని చేయును. చేదుపుచ్చకంటె ఇది మృదువుగా పని చేయును. విషమజ్వరముల కిది యుత్తమమైన యౌషధి. పిల్లల క్రిమిరోగములయందు కటుకరోహిణి బాగుగా పనిచేయును. (మెటీరియా మెడికా ఆఫ్ ఇండియా. R. N. Khory part II, P. 457.)

అమృతాంజనము

అన్ని నొప్పులను

బాధలను కుదుర్చునని

<u>తమకు తెలియును</u>

<u>అయిన తెలియవలశిన దేది !</u>



నేడు దేశమంతటను కుక్క గొడుగుల వలె తలలెత్తిన నకలు మందుల చూచి మోసపోకుండుటయే !

బజారులలో కొనుటకు పూర్వము మా ట్రేడు మార్కు గుర్తులన్నిటిని జాగ్రత్తగా పరిశీలించుడు.